

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	40.6	27.5
కావలి	37	28
ఆత్మకూరు	40	27
ఉదయగిరి	41	26
కందుకూరు	38	28

కావలి కన్నీరొలికింది!

- మధుసూదన్‌రావు మృతదేహాన్ని చూసి చలించిపోయిన హృదయాలు
- కన్నీరుమున్నీరైన మృతుడి తల్లిదండ్రులు
- గుండెలవిసేలా రోదించిన బంధువులు
- డిప్యూటీ సీఎం పవన్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల ఓదార్పు

'వృద్ధాప్యంలో మాకు తోడుంటావనుకున్నామె. భార్యాపిల్లలతోపాటు తోబుట్టువులకు ఆసరా నిలుస్తానుకుంటే ఇలా చేశావేంటిరా!. ఇక మాకు దిక్కెవెరు దేవుడా!? కనీసం బిడ్డ ముఖం కూడా చూడనీయకుండా చేశావేంటి!? నీకేం పాపం చేశామయ్యా!?' అంటూ గుండెలవిసేలా రోదిస్తున్న ఆ వృద్ధదంపతులను చూసి అందరి కళ్లు చెమర్చాయి.

'ఐ లవ్‌యూ నాన్న.. ఐ మిస్ యూ నాన్న' అంటూ తండ్రి మధుసూదన్‌రావు మృతదేహంపై పడి రోదిస్తున్న 13ఏళ్ల దత్తసాయిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు.

తమతో ఎప్పుడూ ఆప్యాయంగా, సంతోషంగా ఉండే వ్యక్తి ఇక లేడని తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, సన్నిహితులు తరలిరావడంతో కావలిలోని ఆనాలవారివీధి కిక్కిరిసిపోయింది.

అటు బంధువర్గం, ఇటు ప్రజాప్రతినిధులు, అధికారుల నడుమ గురువారం సాయంత్రం మధుసూదన్‌రావు అంతిమయాత్ర అధికార లాంఛనాలతో పూర్తయ్యాయి.

కావలి రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్‌రావు మృతదేహాన్ని బుధవారం అర్ధరాత్రి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నైకు తరలించారు. అక్కడ నుంచి కావలి తహసీల్దారు శ్రావణ్ కుమార్, మృతుడి కుటుంబసభ్యులు మృతదేహాన్ని గురువారం ఉదయం కావలికి తీసుకువచ్చారు. అంబులెన్స్‌లో వచ్చిన మధుసూదన్‌రావు మృతదేహాన్ని సీఐలు ఫిరోజ్, గిరిబాబు, మృతుడి బంధువులు ఇంటికి తీసుకువెళ్లారు. మృతుడి తల్లిదండ్రులు సోమిశెట్టి తిరుపాల్, పద్మావతి హృద్రోగులు కావడంతో మొదట కుమారుడి మరణ వార్త తెలియకుండా జాగ్రత్తపడ్డారు. ప్రమాదంలో మధసూదన్‌రావు కాలికి, తలకు గాయాలు అయ్యాయని, చెన్నైలో చికిత్స పొందుతున్నట్లు, పరిస్థితి విషమంగా ఉందని బంధువులు చెబుతూ వచ్చారు. గురువారం ఉదయం నిద్రలేచేసరికి కుమారుడి మృతదేహం ఇంటి ముందు కనిపించటంతో తిరుపాల్, పద్మావతిలు పుట్టెడు దుఃఖంతో తల్లడిల్లిపోయారు. బంధువుల సూచనల మేరకు ఇంటివద్ద ఓ అంబులెన్స్‌తోపాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. కాగా, ఉగ్రదాడిలో మధుసూదన్‌రావు తలభాగం మొత్తం ఛిద్రం కావటంతో ముఖం కనిపించకుండా ప్యాక్ చేసి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు, బంధువులతోపాటు స్థానికులు కడచూపు కూడా చూడలేక పోయామన్న రోదనలు మిన్నంటాయి.





మధుసూదన్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు తిరుపాల్, పద్మావతి

• మిస్ యూ నాన్న!



కళ్లెదుటే ఉగ్రమూకల దాడిలో భర్త మృతి చెందటాన్ని జీర్ణించుకోలేకపోయిన మధుసూదన్‌రావు భార్య ప్రసన్న కామాక్షి, కుమార్తె మేధశ్రీని ఓదార్చడం బంధువులకు కష్టంగా మారింది. ఇక కుమారుడు దత్తసాయి తండ్రి మృతదేహంపై పడి 'ఐ లవ్ యూ నాన్న... ఐ మిస్ యూ నాన్న' అంటూ మృతదేహంపై పడి ఏడవటం అందరినీ కంటతడి పెట్టించింది. ఎంత ఓదార్చినా పైకి లేవలేదు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా ఆ బాలుడ్ని ఓదార్చి ధైర్యం చెప్పారు.

• అధికార లాంఛనాలతో..

ప్రభుత్వ ఆదేశాలతో సందర్శనార్థం మధుసూదన్‌రావు సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దనే ఉంచారు. ఆ తర్వాత రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌లు పాడె మోసుకుంటూ వెళ్లి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచారు. కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్‌లు ముందు నడుస్తూ అంతిమ యాత్ర పట్టణ పురవీధులలో నుంచి బాలకృష్ణారెడ్డి శ్మశాన వాటిక వరకు సాగింది. అక్కడ అధికార లాంచనాలతో చివరి ఘట్టం సాగింది. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపిన అనంతరం మధుసూదన్‌రావు మృతదేహాన్ని పూడ్చిపెట్టారు.

• మిన్నంటిన రోదనలు

తల్లిదండ్రులతోపాటు తమను ఎంతో ఆప్యాయంగా కంటికి రెప్పలా చూసుకున్న అన్న ఇక లేడని తెలుసుకుని మధుసూదన్‌రావు తోబుట్టువులైన విజయలక్ష్మి, మంజుల గుండెలవిసేలా రోదించారు పసన్న కామాక్షి అమ్మ పసుపులేటి శ్యామలాదేవి, పిన్ని, బాబాయ్‌లు బుచ్చినాయుడు, లలితమ్మ కూడా భార్యా పిల్లల్ని ఒంటిరిని చేసి వెళ్లావా అంటూ కన్నీటి పర్వంతమయ్యారు.





మధుసూదన్‌రావు సమీప బంధువు కుమార్తె, కుమారుడు దత్తసాయిని గుండెకు హత్తుకుని ఓదార్చుతున్న పవన్‌కల్యాణ్

కన్నీరు పెట్టించిన కశ్మీర్ ఘటన

చలించిపోయిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు



మధుసూదన్‌రావు పాడె మోస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్

కావలి, కావలిరూరల్, (ఆంధ్రజ్యోతి) : మధుసూదన్‌రావుకు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు కావలికి వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు మృతుడి భార్య, పిల్లలు కశ్మీర్‌లో జరిగిన ఘటనను తెలిపారు. ఇదంతా విని వారి చలించి పోయారు. ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, ఎమ్మెల్యేలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి తదితరులు విడివిడిగా, సమూహంగా మధుసూదన్‌రావు భార్య, పిల్లలతో మాట్లాడి, ఓదార్చరు. పవన్‌కల్యాణ్‌కు మధుసూదనరావు భార్య కామాక్షి ప్రసన్న జరిగిన ఘటనను వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యింది. ఉగ్రవాదులు చాలా క్యాజువల్‌గా వచ్చి నరమేధం సృష్టించి వెళ్లారంటూ బోరుమంది. మృతుడి తల్లిదండ్రులతోపాటు బంధువులను ఓదార్చిన పవన్ ప్రభుత్వం తప్పక ఆదుకుంటుందంటూ భరోసా ఇచ్చారు.





కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల నేపథ్యంలో ఢిల్లీలోని పాక్ హైకమిషన్ సంబరాలు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం నెల్లూరులో పాకిస్తాన్ జాతీయ జెండాలను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

జూలైలో కొత్త పింఛన్ల మంజూరు?

- కసరత్తు ప్రారంభించిన అధికార యంత్రాంగం
- ఇప్పటికే 5వేల దరఖాస్తుల పెండింగ్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల కోసం ఎదరు చూస్తున్న పేదలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. జూలైలో కొత్త పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించింది. గత వైసీపీ హయాంలో వివిధ రకాల పింఛన్ల కోసం సుమారు ఐదు వేల మంది పేదలు దరఖాస్తు చేసి ఉన్నారు. రోజులు గుడుస్తున్నా పింఛన్లు మాత్రం మంజూరు కాలేదు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల కోసం అర్హులు నిరీక్షిస్తుండగా, అనర్హులు అనేకమంది అప్పనంగా పింఛన్లు తీసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పార్టీల ముద్ర వేసి పలువురు అర్హులకు పింఛన్లు తొలగించి, అనర్హులకు మంజూరు చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనర్హుల ఏరివేత ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్నా రద్దయిన వారికి పునరుద్ధరించాలని నిర్ణయించింది.

• దివ్యాంగులకు పింఛన్లు

జిల్లాలో 29,409 మంది దివ్యాంగులు పెన్షన్లు పొందుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల కేటగిరీలో బోగస్ సదరం ధ్రువపత్రాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుకు ముందే వాటిని పరిశీలించేందుకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సదరం శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు పరిశీలన కార్యక్రమం వేగంగా జరుగుతోంది. ఈ పెన్షన్లతోపాటు బెడ్ రిడన్ పింఛన్లు పొందుతున్న వారు కూడా ఉన్నారు. తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలతో మంచానికే పరిమితమైన వారు జిల్లాలో 1274 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.15వేల పింఛను అందుతోంది. వీరిలో చాలామంది అనర్హులు ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. వైద్య ఆరోగ్య శాఖ నివేదిక ఆధారంగా త్వరలో అనర్హుల వివరాలు వెల్లడికానున్నాయి. వాస్తవంగా మంచానికే పరిమితమైన వారికి పింఛన్లు అందుతాయి. అనర్హులను పక్కన పెడతారు. అంతేగాక కొత్త వారికీ పింఛన్లు మంజూరు చేయనున్నారు. అలాగే, కుటుంబ యజమాని కోల్పోయిన మహిళలకు కేవలం 15రోజుల వ్యవధిలో పింఛను అందించ డానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే 1,749 మందికి (స్పౌస్) ఆ పెన్షన్లు మంజూరై అందు తున్నాయి. జిల్లాలో కొత్త వారికీ పెన్షన్ల మంజూరుకు రంగం సిద్ధమవుతోంది.

స్పౌజ్ పింఛన్ల మంజూరుకు ఉత్తర్వులు

స్పౌజ్ పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 2023, డిసెంబరు 1 నుంచి 2024, అక్టోబరు 31వతేదీ వరకు పింఛను తీసుకుంటూ మరణించిన కుటుంబ యజమాని స్థానంలో వారి భార్యకు వితంతు పింఛను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోల లాగిన్‌లో నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ఆప్షన్ ఇచ్చిందని పేర్కొన్నారు. స్పౌజ్ పెన్షన్ కోసం సంబంధిత పత్రాలతో వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందిని అర్హులు కలవాలని కోరారు.



పేట ఉత్సవంలో భగవద్రామానుజ స్వామి

సమతామూర్తీ.. నమోస్తుతే!

సమతామూర్తి, విశిష్ట అద్వైత సిద్ధాంతకర్త భగవద్రామానుజాచార్యుల 1008వ అవతార ఉత్సవాలు నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం తిరుమంజ నం, సాయంత్రం మంగళ శాసనోత్సవం, పేట ఉత్సవం జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

కమీషన్ ఇస్తే


లోన్ ఇప్పిస్తాం!

- ఎస్సీ కార్పొరేషన్‌లో దళారుల దందా
- సబ్సిడీ రుణాలు ఇప్పిస్తామంటూ మోసం
- కుల సంఘాల ముసుగులో కొందరి దోపిడీ

'మీకు సబ్సిడీ లోన్ కావాలంటే మేము చెప్పాల్సిందే! కుల సంఘం నాయకులం కాబట్టి అధికారులు మా మాటే వింటారు. లోన్ ఇప్పించే బాధ్యత మాది. అయితే, మీకొచ్చే రుణంలో కొంత మాకు ఇవ్వాలి. ఈలోపు అడ్వాన్సుగా అందులో సగం డబ్బు ఇవ్వండి.'

అంటూ కొందరు దళారులు అమాయకులపై వల విసురుతున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా అంతా పారదర్శకంగా రుణాల మంజూరు ప్రక్రియ చేపట్టినా కొందరు దళారులు ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చే అమాయకులకు మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారు. ఒక్కో లోన్‌కు రూ.30 వేలు చొప్పున బేరం కుదుర్చుకోగా, ముందుగా రూ.15 వేలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గత నెలలో ఇదే మాదిరిగా బీసీ కార్పొరేషన్‌లో కూడా కొందరు దళారులు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించగా అధికారులు బ్రేకులు వేశారు. ఇప్పుడు ఎస్సీ కార్పొరేషన్ వంతు వచ్చింది.

సొంతకాళ్ల మీద నిలబడాలని ఆశించే వారికి సబ్సిడీ రుణాలు చాలా ఉపయోగకరంగా నిలుస్తాయి. ఇందులో 40 - 60 శాతం వరకూ సబ్సిడీ ఇస్తుండటంతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉంటోంది. గత వైసీపీ హయాంలోని ఐదేళ్లలో ఒక్క రుణం కూడా మంజూరు చేయలేదు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సబ్సిడీ రుణాల జాతర మొదలైంది. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రభుత్వం 1,240 యూనిట్లను మంజూరు చేసింది. ఇందుకు రూ.51.81 కోట్లతో అనుమతులు ఇచ్చింది. అందులో రూ.20.46 కోట్లను సబ్సిడీ కింద, మరో రూ.28.75 కోట్లను బ్యాంకు రుణంగా సమకూర్చనున్నారు. మిగిలిన ఐదు శాతం అంటే రూ.2.59 కోట్లను లబ్ధిదారులు చెల్లించాలి. రూ.3 లక్షలలోపు రుణాలు 226 ఉండగా వీటికి 60 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అలానే రూ.3 లక్షల నుంచి 10 లక్షల వరకూ ఉన్న యూనిట్లు 628 ఉండగా వీటికి 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. ఇవిగాక ఆటోలు, ట్రక్కులు, కార్లు, ఇతర వాహనాలు కూడా మంజూరు చేస్తుండగా వీటికి 50 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. చాలా కాలం తర్వాత భారీ ఎత్తున రుణాలు మంజూరు కావడం, వాటికి సబ్సిడీ మొత్తం కూడా పెరగడంతో ఈ రుణాలు పొందేందుకు చాలా మంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. వచ్చే నెల 10వ తేదీ వరకూ దరఖాస్తుకు గడువు ఉంది. ఈ క్రమంలోనే కొందరు దళారులు రంగ ప్రవేశం చేసి దరఖాస్తుదారులకు వల విసురుతున్నారు. నెల్లూరులోని అంబేడ్కర్ భవన్ వేదికగా కొందరు ఈ వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితం ఈ వ్యవహారంలో కొందరు దళారులు, దరఖాస్తుదారుల మధ్య పెద్ద గొడవే జరిగినట్లు సమాచారం.



• బీసీ కార్పొరేషన్‌కు భారీగా దరఖాస్తులు

ఇటీవల బీసీ కార్పొరేషన్‌తోపాటు మరో తొమ్మిది కార్పొరేషన్‌లకు సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు స్వీకరించారు. బీసీ కార్పొరేషన్‌కు 1328 యూనిట్లు మంజూరు చేయగా వీటి కోసం 14973 మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం. అలానే టైలరింగ్‌కు 4967 యూనిట్లు మంజూరవగా వీటికి 29097 దరఖాస్తులు అందాయి. మొత్తంగా పది కార్పొరేషన్లలో 7096 యూనిట్లకు 29097 మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ఒక యూనిట్‌కు నలుగురు చొప్పున దరఖాస్తున్నారన్నమాట. వీరిలో 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు ఎంపిక చేసి వారిలో అర్హులకు బ్యాంకు రుణాలు ఇప్పించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉంది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

గణితమే

గండి కొట్టింది!

- 'పది'లో ఎక్కువమందికి లెక్కలే తప్పాయి
- జిల్లాలో మ్యాథ్స్‌లో 3,439 మంది ఫెయిల్
- ఆ తరువాత స్థానం సైన్సుది!
- పేపర్ వ్యాల్యుయేషన్‌పై అనుమానాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు పలువురికి గణితం గండి కొట్టింది. జిల్లావ్యాప్తంగా ఎక్కువమంది పదిలో లెక్కల్లోనే తప్పారు. ఫెయిల్ అయిన విద్యార్థుల్లో అత్యధికంగా మ్యాథ్స్‌లో 3,439 మంది ఉన్నారు. వీరు అన్ని సబ్జెక్టులలో 60, 70, 80 శాతం మార్కులు పొందగా, ఒక్క మ్యాథమ్యాటిక్స్‌లోనే ఫెయిల్ అయ్యారు. రెండోస్థానంలో సైన్సు ఫెయిల్ అయినవారు ఉన్నారు.

• వ్యాల్యుయేషన్‌పై అనుమానాలు

జిల్లాలో ఈ ఏడాది పదోతరగతిలో మొత్తం 9,045 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరిలో అత్యధికంగా గణితంలో 3439 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. తెలుగులో 1061 మంది, హిందీలో 122 మంది, ఇంగ్లిష్‌లో 704, సైన్స్‌లో 2555, సోషల్‌లో 1164 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేకపోయారు. తాము పరీక్ష బాగానే రాసామని, తప్పక పాస్ అవుతామని చెప్పిన విద్యార్థుల్లో అత్యధిక మంది ఒక్క గణితంలో మాత్రమే తప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తమ విద్యార్థుల్లో అత్యధికశాతంమంది అన్ని సబ్జెక్టులలో ఉత్తమ మార్కులు సాధించారని, ఒక్క గణితంలో మాత్రమే ఫెయిల్ కావడం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జవాబుపత్రాల మూల్యాంకనం హడావుడిగా చేపట్టడం, వేగవంతంగా పూర్తి చేయాలన్న ఆలోచనలతో గణితం పత్రాలను అసలు మ్యాథ్స్ టీచర్లతో దిద్దించారా ? లేక ఇతరులతో చేయించారా ? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. దీని పరిష్కారం దిశగా పాఠశాల విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు.

• రీవెరిఫికేషన్‌కు రెడీ..

గణితం సబ్జెక్టుకు సంబంధించి ప్రశ్నపత్రంలో కూడా కొన్ని లోపాలున్నా వాటిని అధిగమించి విద్యార్థులు పరీక్షలు రాశారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఫలితాలకు ముందు వచ్చిన కీ పరిశీలించుకున్న నేపథ్యంలో సైతం వారు తమకు వచ్చే మార్కులను ముందుగానే బేరీజు వేసుకుని తమతో చర్చించారని అంటున్నారు. అయితే ఫలితాలు విడుదలైన తరువాత అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు వచ్చినా విద్యార్థులకు సైతం ఒక్క మ్యాథ్స్‌లో వారు ఊహించిన మార్కులు కాకుండా ఫెయిల్ మార్కులు రావడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

• తరువాత స్థానం సైన్సుదే..

అలాగే కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఒక్క సైన్స్ మాత్రమే ఫెయిల్ కావడంపై కూడా జిల్లాలో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. తమ బిడ్డలకు కలిగిన నష్టాన్ని విద్యాశాఖ అధికారులు కూడా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. రీవెరిఫికేషన్ అనే అస్త్రాన్ని సంధించేందుకు సమాయత్తమవుతున్నారు. అన్ని పేపర్లలో సగటున 60శాతం మార్కులు పొంది ఒక్క సబ్జెక్ట్ ఫెయిల్ అయితే ఆ సబ్జెక్టుకు రీవాల్యుయేషన్ చేస్తే తమ బిడ్డలకు న్యాయం జరుగుతుందని అంటున్నారు.

రెక్కల కష్టానికి వచ్చిన రొక్కం!

- జిల్లాలో 'ఉపాధి' బకాయిలు 42 కోట్లు
- తొలివిడతగా రూ.20 కోట్ల మంజూరు
- కూలీల బ్యాంకు ఖాతాలకు నగదు జమ

ఉదయగిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పేరుకుపోయిన బకాయిలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొత్తం రూ.42 కోట్ల బకాయిలలో రూ.20 కోట్లు విడుదల కావడంతో కూలీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమఅవుతోంది. జిల్లాలో ప్రతిరోజు 75 వేల మంది పనులు చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ పూర్తి కావడంతో కూలీలకు ఉపాధి పనులే దిక్కు అయ్యాయి. వారానికోసారి కూలి చెల్లించాల్సి ఉండగా ఈ ఏడాది జనవరి 16 నుంచి బకాయిల చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో కూలీలకు ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. ఈ నేపథ్యంలో బకాయిలు విడుదల కావడంతో కూలీలకు ఊరట లభించింది. ఈ విషయమై డ్వామా పీడీ గంగా భవానిని అడగ్గా జిల్లాలో రూ.42 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఇప్పటికే కూలీల ఖాతాల్లో రూ.20 కోట్లు జమ అయినట్లు తెలిపారు. మిగిలిన నగదు త్వరలో జమ కానున్నట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన

ఉదయగిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరు, కొండాయపాళెం గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ రైతులకు వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు, భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం వర్షాధార, ఆరుతడి పంటలపై, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9317
వెండి కిలో ధర	రూ. 100,500
వెండి ఒక గ్రాము	రూ.103.50

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి హామీ పనులు

● అచ్చయ్య, ఇన్‌చార్జి ఏపీవో



సంగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు కలిగి పని అడిగిన ప్రతిఒక్కరికీ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని కల్పిస్తున్నామని ఎన్‌ఆర్‌ఈజీయస్ ఇన్‌చార్జ్ ఏపీవో కె అచ్చయ్య పేర్కొన్నారు.

? మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో ఎంతమంది కూలీలు పనులకు వచ్చేవారున్నారు.

! మండలంలోని 20 పంచాయతీల్లో 8వేల జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 6వేల మంది పనులకు వస్తున్నారు.

? ఎన్ని పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు ఉన్నారు. వారు లేనిచోట్ల పనుల పరిస్థితి ఏమిటీ.

! 20 పంచాయతీలకు గాను 13 పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు ఉన్నారు. మిగిలిన పంచాయతీల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీనియర్ మేట్‌లతో ఉపాధి హామీ పనులు చేయిస్తున్నాం.

? ప్రస్తుతం ఎన్ని పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. ఏ పనులు చేస్తున్నారు. ఎంతమంది కూలీలు పనులకు వస్తున్నారు.

! ప్రస్తుతం 15 పంచాయతీల్లో పంట కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. రోజుకు 9వేల మంది పనులు చేస్తున్నారు.

? మండలంలో రోజుకు ఎంతమంది కూలీలకు పని కల్పించాలి.

! రోజుకు 2వేల మందికి పని కల్పిచాలన్నదే లక్ష్యం. ఆదిశగా పనులు చేపట్టి కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



40 ఏళ్ల తర్వాత కలిసిన పాఠశాల పూర్వ విద్యార్థులు

సీతారామపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామ జడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం 1980-1985 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 6 నుంచి పదో తరగతి వరకు చదివిన 33మంది విద్యార్థులు కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈసందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువు తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షఫీ, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 689 బేళ్లను తీసుకొని రాగా 15 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 469 బేళ్లు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 220 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 220 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

వింజమూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. వింజమూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని జి.జ్ఞాపిక 593, బాలికల హైస్కూల్ విద్యార్థిని పి.ధనలక్ష్మీ 592 మార్కులు సాధించారు. అలాగే గుండెమడకల, కాటేపల్లి, ఊటుకూరు, చాకలకొండ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.

పేకాట స్థావరంపై దాడి

● 12 మంది అరెస్టు

అనంతసాగరం ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరం వద్ద మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారం ఆత్మకూరు సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. 12 మంది జూదరులను అరెస్టుచేసి ఐదు బైకులు, రూ. 69,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో మర్రిపాడు ఎస్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కలువాయి: స్థానిక చెరువు సమీపంలోని పేకాట స్థావరంపై గురువారం కలువాయి ఇన్‌చార్జ్‌గా ఉన్న కండలేరు ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోని తీసుకుని వారి వద్ద నుంచి 4500 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వరదలు వస్తే సోమశిలకు ముప్పు తప్పదు

● బలహీనంగా పొర్లుకట్టలు ● వైసీపీ పాలనలో నామమాత్రంగా మరమ్మతులు



రాళ్లుతేలి బలహీనంగా ఉన్న కట్ట

అనంతసాగరం ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి పొర్లుకట్టల ప్రాధాన్యత ఎంతో కీలకం. అయితే గతంలో (2020-2021)లో ఎగువ నుంచి సోమశిలకు వచ్చిన భారీ వరదల కారణంగా డ్యాం కట్టడాలు ధ్వంసమైన విషయం తెలిసిందే. కాగా, జలాశయం ముందువైపు నది అడుగు భాగం నుంచి నిర్మించిన పొర్లుకట్టలు, రివెట్‌మెంట్ నిర్మాణాలు దెబ్బతిన్నాయి. అవి అత్యవసరంగా చేయాల్సిన పనులు కాగా, గత వైసీపీ హయాంలో నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. ఈక్రమంలో రాబోవు వర్షాకాలంలో ఎగువ నుంచి భారీ వరద వస్తే ముప్పువాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఇక పవర్‌ప్లాంట్ నుంచి డెల్టాకు నీరు సరఫరా చేసే కాలువ గట్లు, క్యాంపు కార్యాలయ సమీపంలో పొర్లుకట్టలు కోతకు గురయ్యాయి. ఆప్రాతంలో మట్టికట్టల నిర్మాణ పనులు చేశారు. అయితే రాళ్లతో రివెట్‌మెంట్ పనులు పూర్తిచేయలేదు. 11,12 క్రస్ట్‌గేట్ల నుంచి నీరు సరఫరా చేసే బ్రిడ్జికి ముందు ఉన్న నిర్మాణాలు రాళ్ల తేలి బలహీనంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆగస్టు నుంచి సోమశిలకు కృష్ణాజలాలు వచ్చే సూచనలు ఉండగా, అక్టోబరు, నవంబరు మాసాల్లో తుఫాన్ల ముప్పు ఉంటుంది. ఆ కారణంగా ఎగువ నుంచి భారీగా వరద వచ్చే ప్రమాదం ఉంది. ఈక్రమంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పొర్లుకట్టల పటిష్ఠతకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ఉదయగిరి: మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



వరికుంటపాడు : గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ నాగేంద్ర తదితరులు

ఆత్మకూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని సేవలు పంచాయతీ రాజ్ సంస్థలు అందిస్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి కె శ్రీనివాసులు, ఏపీవో మధుసూధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

● అనంతసాగరం: దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నట్లు అనంతసాగరం ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. గురువారం ప్రపంచ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : స్థానిక పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో పాలకవర్గం సహకారంతో పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముర్తుజా, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు నవాజ్, సమద్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

● వరికుంటపాడు : అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల అరుణ పేర్కొన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక సచివాలయంలో సర్పంచ్ కొండిపోగు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ మట్టి హరి నారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, డీటీ చెంచయ్య, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి




గళ్ల పరీక్షను పరిశీలిస్తున్న డాక్టర్ భవాని రామకృష్ణన్

అనంతసాగరం ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్, క్షయవ్యాధి నివారణాధికారి డాక్టర్ భావని రామకృష్ణన్ గురువారం ఆకస్మిక తనిఖీచేశారు. ఈసందర్భంగా ల్యాబ్‌ను సందర్శించి గళ్ల పరీక్షలను పరిశీలించి సూచనలు చేశారు. క్షయ నిర్మూలనకు కృషి చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణి, ల్యాబ్ టెక్నీషియన్ మీరామొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రిజర్వాయర్ లీజు వేలం నిలిపివేత

సంగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్‌లో చేపలు పట్టుకొనుటకు శుక్రవారం నిర్వహించాల్సిన లీజు వేలంపాట నిలిపివేసినట్లు ఎఫ్‌డీవో పొట్టియ్య ఒక ప్రకటనలో తెలిపారు. కనిగిరి రిజర్వాయర్‌లో చేపలు పట్టుకొనుటకు హక్కులు కల్పించేందుకు ఈనెల 25వ తేదీన బహిరంగ లీజు వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ ప్రకటించిన విషయం విదితమే. అయితే గాంధీజన సంఘం మత్స్యశాఖ సహకార సంఘం సభ్యులు ఇటీవల జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను, మత్స్యశాఖ జెడీని కలిసి కనిగిరి రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునే హక్కులను తమ సంఘానికి అప్పగించాలని కోరారు. వారి కోరిక మేరకు ప్రస్తుతం తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అయితే మే నెలాఖరులోపు గాంధీజన మత్స్య సహకార సంఘం ప్రభుత్వానికి చెల్లించాల్సిన లీజు చెల్లించాలని, లేనిపక్షంలో మళ్లీ లీజు వేలం పాట నిర్వహణకు ప్రకటించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు



విద్యార్థినికి కేక్ తినిపిస్తున్న మాల్యాద్రి నాయుడు తదితరులు

ఏఎస్ పేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కావలి ఎడవల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు అభినందన సభ గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మంత్రి ఓఎస్‌డి జి వెంకటేశ్వర్లు, పాఠశాల పూర్వ విద్యార్థి నాగినేని మస్తాన్ నగదు బహుమతులు అందచేశారు. సోషల్ ఉపాధ్యాయుడు సుధాకర్‌ను, హెచ్‌ఎం వెంకటేశ్వరరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పూరి ధనమ్మ, నాయకులు ఏలూరి మాల్యాద్రి నాయుడు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్లలో వసతుల కరువు

● ఎండలో ప్రయాణికుల అవస్థలు



ట్యాంక్‌బండ్‌పై ఎండలో బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ఉదయగిరి, ఏప్రిల్ 24: పట్టణంలో పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనం అపరిశుభ్రంగా ఉండడం, వసతులు లేకపోవడంతో ఎండలోనే ప్రయాణికులు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు ప్రయాణికులు ఎండకు తట్టుకోలేక చెట్ల కిందకు, దుకాణాల దగ్గరకు వెళ్లి సేదతీరాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ట్యాంక్‌బండ్‌పై ఓ దాత ఏర్పాటు చేసిన షెల్టర్‌లో స్థలం లేకపోవడం, తగినన్ని సీట్లు లేకపోవడంతో రోడ్డుపైనే ప్రయాణికులు ఎండలో బస్సుల కోసం నిలబడుతున్నారు. అలాగే దుత్తలూరు, వరికుంటపాడు, సీతారామపురం, వింజమూరు ప్రాంతాల్లో సైతం ప్రయాణికులకు సరైన షెల్టర్లు లేకపోవడంతో ఎండకు ఎండుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి షెల్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రయాణికులను ఎండ నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ

జనసేన నేతల మౌన దీక్ష



ఉదయగిరిలో మౌన దీక్ష చేస్తున్న జనసేన నాయకులు

ఉదయగిరి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ఖండించడంతోపాటు వారి చేతిలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని గురువారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో జనసేన ఆధ్వర్యంలో మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడులు జరపడం పిరికిపంద చర్య అని, ఇలాంటి దాడులను ఉపేక్షించరాదన్నారు. ఈ దుశ్చర్యను దేశం మొత్తం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బయ్యన్న, కొట్టే వెంకటేశ్వర్లు, సురేంద్రరెడ్డి, రవీంద్ర, కిరణ్‌కుమార్, కమతం శ్రీనివాసులు, బొజ్జా నరసింహులు, ఉప్పుటూరి పెదవెంకటయ్య, ఆవుల రోశయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ

ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఉదయగిరి పట్టణంలో గురువారం రాత్రి విశ్వ హిందూ పరిషత్, హిందూ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ఉగ్రవాదుల దాడుల్లో అమరులైన వారికి కొవ్వొత్తుల ప్రదర్శనతో శ్రద్ధాంజలి తెలిపారు. అలాగే పాకిస్తాన్ జెండాతో ఉన్న చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, విప్లవకుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి

సంగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రాన్ని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె శిక్షణకు వచ్చే వారి హాజరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంగం, మర్రిపాడు, ఆత్మకూరు రూరల్, అర్బన్‌లో కుట్టు శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి శిక్షణా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. శిక్షణకు ఎంపికైనవారు తప్పనిసరిగా కేంద్రానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా బీసీ కార్పొరేషన్‌లో మేదర, కుమ్మరి యూనిట్లతోపాటు జనరిక్ దుకాణాలు ఖాళీగా ఉన్నాయన్నారు. బీసీ, ఈబీసీల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీవో షాలెట్ పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి సచివాలయ సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. ఉపాధి కూలీలు, కార్మికులు, విద్యార్థులు వేసవిలో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. వారు వడదెబ్బకు గురికాకుండా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ వరప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

● ఐదు కేజీల సరుకు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సిటీ డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి నెల్లూరు నగరంలోని కొందరు వ్యక్తులకు విక్రయిస్తున్న ముఠాను సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను సంతపేట స్టేషన్‌లో నగర డీఎస్పీ పీ సింధుప్రియ గురువారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం బరంపూర్‌కు చెందిన రంజిత్ నాయక్ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ ప్రాంతానికి వచ్చాడు. చెడు వ్యసనాలకు బానిసైన రంజిత్ సులభంగా డబ్బు సంపాదించడం కోసం గంజాయి విక్రయాన్ని మార్గంగా ఎంచుకున్నాడు. ఒడిశాలో కేజీ గంజాయిని రూ.5వేలకు కొనుగోలు చేసి నెల్లూరుకు తీసుకువచ్చేవాడు. నగరంలోని ప్రగతినగర్‌కు చెందిన షేక్ హుస్సేని అలియాస్ హుస్సేన్, షేక్ రఫీ అలియాస్ గాంధీ, నారాయణ రెడ్డిపేటకు చెందిన రాపర్తి అలియాస్ నాపర్తి భాను ప్రకాష్, కిసాన్‌నగర్‌కు చెందిన పూడి వంశీకృష్ణకు ఆ కేజీ గంజాయిని రూ.20 వేలకు విక్రయించే వాడు. వారు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి ప్యాకెట్ రూ.300 చొప్పున విక్రయిస్తూ కేజీ గంజాయిని రూ.50 వేలకు అమ్ముకొనేవారు. ఇలా జరుగుతున్న గంజాయి విక్రయాలపై పక్కా సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథ రామయ్య నిందితులపై నిఘా ఉంచారు. బుధవారం నగరంలోని పెన్నా నది పొర్లుకట్ట వద్ద రంజిత్ నాయక్ గంజాయిని మిగిలిన నలుగురికి విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముఠాను పట్టుకున్న పోలీసులను డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ దశరథ రామారావు, ఎస్‌ఐ బాలకృష్ణ, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో నుంచి పడి చిన్నారి దుర్మరణం

కలువాయి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి కిందపడి చిన్నారి దుర్మరణం చెందిన సంఘటన గురువారం సాయంత్రం కలువాయి మండలం వెరుబొట్లపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేజర్ల మండలం చిత్తలూరుకు చెందిన సుస్మిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని బుధవారం అనంతసాగరం మండలం చిలకలమర్రిలో బంధువుల వివాహానికి వెళ్లింది. అక్కడనుంచి గురువారం ఉదయం కలువాయిలోని అమ్మగారి ఇంటికి పిల్లలతో వచ్చింది. సాయంత్రం ఇద్దరు పిల్లలతో కలసి సుస్మిత కలువాయి నుంచి చిత్తలూరుకు ఆటోలో బయలుదేరింది. వెరుబొట్లపల్లి రోడ్డు దగ్గరకు వచ్చేసరికి ఆటోలో ఉన్న చిన్న కుమారుడు ధనుష్ (3) జారికింద పడిపోయాడు. వెంటనే గాయపడిన ధనుష్‌ను వైద్యం కోసం ఆదూరుపల్లికి తీసుకుపోగా అక్కడ మృతిచెందాడు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న వీఆర్వో

కొండాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని రామానుజపురంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. బాధితుడు బండ్లమూడి మధు కథనం మేరకు, బుధవారం సాయంత్రం తాము బంధువులపెళ్లికి ఊరికివెళ్లగా ప్రమాదం చోటుచేసుకున్నదన్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.20 వేలు విలువచేసే వంటసామగ్రితో పాటు నగదు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయన్నారు. కట్టుబట్టలతో మిగిలామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు. దగ్ధమయిన ఇంటిని వీఆర్వో మహేష్ పరిశీలించారు.

చలివేంద్రాల జాడేది!?

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండు వేసవి దృష్ట్యా గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ పంచాయతీల్లో వాటి జాడే కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, జనసంచార ప్రాంతాల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకొనే నాథులే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నుంచి వినతులు అందుతున్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారనే చెప్పుకోవచ్చు. దీంతో పంచాయతీల్లో దాహం తీర్చే పరిస్థితులు లేకుండా పోయాయని ప్రజలు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు పంచాయతీల్లో నిధుల లేమితో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ముందుకు రావడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం దాతల సహకారంతోనైనా వాటిని ఏర్పాటుచేసి ప్రజల దాహం తీర్చే చర్యలు చేపట్టక పోవడంతో లక్ష్యం నీరుగారి పోతుంది.

మొక్కుబడిగానే: జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం పదుల సంఖ్యలో అవి కనిపిస్తున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసినవే కనిపిస్తుండడం విశేషం. పంచాయతీల్లో అరకొర ఏర్పాటు చేసిన చలివేద్రాలు మొక్కుబడిగా ఫోటోలకే పరిమితమయ్యాయి తప్ప పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజల దాహం తీర్చలేక అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. హడావిడిగా కుండలను పెట్టి చేతులు దులుపు కోవడంతో పేరుకే అన్న చందంగా మారి వెక్కిరిస్తున్నాయి. దీంతో అటుగా ప్రయాణాలు సాగించే ప్రజలు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చేసేదేమిలేక దుకాణాల వద్దకు పరుగులు తీసి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రధానంగా ఎండల ప్రభావం అధికంగా ఉండే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా కనిపిస్తుంది. ఉదయగిరి మండలంలో ఎలాంటి స్పందన కనిపించకపోవడంతో ఇటీవల గండిపాళెంలో జేఎంకే ట్రస్టు తరపున చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారంటే అధికారుల పనితీరు ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. వింజమూరు పట్టణంలోను కేవలం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రెండు చలివేద్రాలను నిర్వహిస్తున్నారు. అలాగే దుత్తలూరులో బీజేపీ తరపున నిర్వహిస్తుండగా వరికుంటపాడు మండలం తూర్పుబోయమడగల, సీతారామపురం మండల కేంద్రంలో మాత్రమే పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేద్రాలు కనిపిస్తున్నాయి. ఇంచుమించు అన్ని మండలాల్లోను ఇలాంటి పరిస్థితి నెలకొంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	218

కోడిగుడ్ల ధర (100): 420

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

లింగసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని కందుకూరు డీఎల్‌పీవో కృష్ణమోహన్ చెప్పారు.గురువారం ఆయన ఎంపీడీవో కట్టా శ్రీనివాసులుతో కలిసి మండలంలోని చినపవని, పెదపవని గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లోని తడి,పొడి చెత్తను క్లాప్‌మిత్రల ద్వారా చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు.దీనివల్ల గ్రామాల్లో దోమల వ్యాప్తి తగ్గి వ్యాధులు రావన్నారు. గ్రామాలు కూడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంటాయని చెప్పారు. ఈ కేంద్రాల్లో తయారయ్యే వర్మీ కంపోస్టు ఎరువును రైతులకు విక్రయించాలన్నారు.ఈ సందర్భంగా కృష్ణమోహన్ ఎంపీడీవో శ్రీనివాసులుకు, పంచాయతీ కార్యదర్శి షేక్ రషీద్‌బాషాకు పలు సూచనలు చేశారు. నిరుపయోగ కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామీణులకు వెసులుబాటు

● ఏపీవో ఎస్‌కే అబ్దుల్లా, ఉలవపాడు



ఉలవపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులు గ్రామీణులకు కొంత ఆర్థిక బలం చేకూర్చేలా ఉన్నాయి.దీంతో రోజువారి కూలీలు పెరిగారు. మండలంలో సుమారు 10,000 జాబ్ కార్డుదారులు ఉన్నారు. రోజుకి సుమారు 3700 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

? : ఉపాధి పనులకు స్పందన ఎలా ఉంది.

! : రోజువారీ ఉపాధి కూలి రేటు పెరగడంతో మండలంలోని అన్నీ గ్రామాల నుంచి పదుల సంఖ్యలో కొత్త జాబ్ కార్డులకు దరఖాస్తులు వస్తున్నాయి.

ఈ-ఇంటర్వ్యూ

? : ఎండలకు కూలీలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

! : కూలీలు ఉదయం 6 గంటలకే పని ప్రాంతానికి చేరుకుంటారు. మస్టర్లు, ఫొటో క్యాప్చర్ అనంతరం తిరిగి 10 గంటలకు వెళ్లిపోతారు. వారు సేద తీరేందుకు టార్పాలిన్ పట్టలతో షెల్టర్ ఏర్పాటు, మంచినీళ్ల క్యాన్లు, పనిచేసే సమయంలో డీహైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కోసం ఫస్ట్‌ఎయిడ్ బాక్సు ఏర్పాటు చేస్తున్నాం.

? : జాబ్‌కార్డులకు దళారులు డబ్బులు వసూళ్లు చేస్తున్నారా..

! : నూతనంగా జాబ్‌కార్డులు కావాల్సిన వాళ్లు నేరుగా తమ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చు. మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన పనిలేదు.

ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన మధుసూదనరావుకు నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు గురువారం కావలికి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం, సత్యకుమార్, ఎమ్మెల్యేలు, అధికారులకు మధుసూదనరావు భార్యా పిల్లలు కశ్మీర్‌లో జరిగిన దాడుల సంఘటనలు తెలిపి కన్నీరుమున్నీరుగా విలపించారు. మధుసూదనరావు భార్యాపిల్లలను, ఇతర కుటుంబసభ్యులను వారు ఓదార్చారు. పవన్‌కల్యాణ్‌కు మధుసూదనరావు భార్య కామాక్షి జరిగిన సంఘటనలు చెప్పుకుని భోరున విలపించారు. పవన్‌ను చూసేందుకు అభిమానులు కాన్వాయ్‌పై ఎగబడ్డారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)




విలపిస్తున్న మధుసూదన్ కుటుంబ సభ్యురాలు, ఓదార్పున్న మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్



ప్రజలకు పవన్ అభివాదం



మధుసూదన్‌రావు కుటుంబసభ్యులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



మధుసూదన్‌రావు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రులు ఆనం, సత్యకుమార్, ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం




అల్లూరు, కొండాపురం ఎంపీడీవో కార్యాలయాల్లో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, అధికారులు, సిబ్బంది

అల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రజనీకాంత్, డిప్యూటీ ఎంపీడీవో పెంచల వీరేంద్ర గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి పీ.వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● సమన్వయంతోనే పంచాయతీల అభివృద్ధి

పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజలు సమన్వయంగా కృషి చేస్తేనే సాధ్యపడుతుందని ఎంపీడీవో రజనీకాంత్ తెలిపారు. మండలంలోని పురిణిలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పెంచల వీరేంద్ర, ఉపసర్పంచి తాండ్ర శ్రీనివాసులు, వార్డు సభ్యులు, వైద్య ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం మండలపరిషత్ కార్యాలయంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఆదినారాయణ గాంధీ, అంబేడ్కర్, చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, ఎంఈవో-2 ఆనందరావు, ఏవో శేషసాయి, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన



ఉగ్రదాడిని ఖండిస్తూ అల్లూరులో నిర్వహించిన నిరసన ర్యాలీ

అల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడులను ఖండిస్తూ అల్లూరులో నిరసనలు వెల్లువెత్తాయి. గురువారం సాయంత్రం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో దీపాలు, ప్లకార్డుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. హిందూ సంఘాల ఆధ్వర్యంలో అల్లూరు కోనేటి సెంటరు వద్ద భారీగా నిరసన ర్యాలీ చేపట్టారు. పాతబస్టాండు కూడలి వద్ద దీపాలతో నిరసన తెలిపారు. మృతులకు వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేయటం హేయమైన చర్య అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సమాజంలో సాటిమనుషుల పట్ల ఇలా అమానుషంగా ప్రవర్తించటం దారుణమని, అటువంటివారిని సమూలంగా నిర్మూలించాలని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మరో ప్రకటనలో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం అనాగరిక చర్య అని ఆమ్ ఆద్మీపార్టీ జోనల్ కోఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు ఒక ప్రకటనలో ఖండించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న టీఆర్ఆర్ ప్రాంగణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. జాబ్‌మేళాకు హాజరుకాదలచిన యువకులు ఏపీ ప్రభుత్వ నైపుణ్యం వెబ్‌సైట్‌లో తమ పేర్లు ముందుగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

క్యాన్సర్ రోగుల కోసం జుట్టు దానం



కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బృందావనానికి చెందిన పీ తరుణ్ క్యాన్సర్ రోగుల కోసం తన జుట్టును దానం చేశారు. మూడేళ్లపాటు పెంచిన తన జుట్టును హైదరాబాద్‌లోని హెయిర్ డొనేషన్ సంస్థ ద్వారా దానం చేశారు. క్యాన్సర్ చికిత్సలో జుట్టు కోల్పోయే పేషెంట్లకి ఈ జుట్టుతో విగ్గులు తయారుచేసి అందిస్తారని, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు తనవంతుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

ఈత కోసం మహిళలకు ప్రత్యేక సమయం

మున్సిపల్ కమిషనర్ అనూష

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పుచెరువు వద్ద మున్సిపాలిటీ నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌లో మహిళల కోసం ఈనెల 28 నుంచి ప్రత్యేక సమయం కేటాయించామని మున్సిపల్ కమిషనర్ కే.అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.మాస్టర్ ట్రైనర్ పర్యవేక్షణలో మహిళలకు, బాలికలకు ఈత నేర్పించే ఏర్పాటుకూడా చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం ఆరున్నర నుంచి 8 గంటల వరకు మహిళల కోసమే కేటాయించామని, నేషనల్ లెవల్ స్విమ్మర్ దాసరి లక్ష్మీదుర్గ ఈ సమయంలో అందుబాటులో ఉండి ఈత నేర్పిస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు మున్సిపల్ కార్యాలయంలో కానీ, స్విమ్మింగ్ పూల్ వద్దకానీ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

జువ్వలదిన్నెలో మాక్‌డ్రిల్



ప్రకృతి వైపరిత్యాలు సంభవించినపుడు చేపట్టాల్సినసహాయక చర్యలను వివరిస్తున్న ఏపీ ఎస్‌డీఆర్ఎం సిబ్బంది

బిట్రగుంట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నెలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సిబ్బంది తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో సన్నివంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీ ఎస్‌డీఆర్ఎం శాఖ సిబ్బంది తుఫాన్, వరదలు వంటివి సంభవించినప్పుడు ఎలాంటి సహాయక చర్యలు చేపడాతారో వాటిని వివరిస్తూ పరికరాలతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కావలి డీఈ బెనర్జీ, ఏడీఈ రవికుమార్, ఏఈ జడరాయ్, ఎఫ్‌డీవో శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎస్సై భోజ్యా, మెరైన్ ఎస్సై కిశోర్ బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు ఉపయోగం

అల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు రెండు విధాలా ఉపయోగమని మండల వ్యవయాసాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కొత్తపాలెంలో గురువారం రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ముందుగా భూసార పరీక్షల నిమిత్తం అవసరమైన మట్టి నమూనాలను తీసుకున్న అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. మట్టి నమూనాల పరీక్షలతో భూసారం పెరుగుతుందని, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి స్వాతి, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వరి, నాయకులు ఎన్. శ్రీనివాసులు, ఎం. సురేంద్ర, హరీష్ పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

కావలి రూరల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సూరిశెట్టి రమేష్(37) అనారోగ్యంతో చెన్నై ఎంజీఎం వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్యా పిల్లలున్నారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇష్టానుసారం స్తంభాల ఏర్పాటు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టరు నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.గ్రామంలో ప్రస్తుతం ఉన్న స్తంభాలు ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినవి.వాటి స్థానంలో వారం నుంచి కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. అయితే కొన్ని స్తంభాలు పాతవాటి పక్కన కాకుండా ఆర్అండ్‌బీ రోడ్డుకు దగ్గరగా ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

అమ్మవారి చీరల వేలం

అల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరు పేటలో వెలసి ఉన్న పోలేరమ్మ ఆలయంలో గురువారం అమ్మవారి చీరలను వేలం వేశారు. ఆలయ ఈవో చిట్టిబాబు, పాలక మండలి సభ్యుల సమక్షంలో ఈ వేలం నిర్వహించారు. అమ్మవారి చీరలను దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. ఈ వేలంలో మొత్తం రూ47,850 ఆదాయం వచ్చినట్టు ఈవో తెలిపారు.

సెల్‌టవర్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

కొండాపురం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌ను వినియోగదారులకు చేరువ చేసేందుకు కేంద్రం ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటున్నదని టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ తాటికొండ అనూష తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో 20 సెల్ టవర్లు ఏర్పాటుకు కేంద్రం అనుమతించిందన్నారు. తహసీల్దార్ కోటేశ్వరరావు సూచనలమేరకు మండలంలో శెట్టిపాలెం, వెలిగండ్ల, మర్రిగుంట గ్రామాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు ఆమె అధికారులతో కలసి స్థలపరిశీలన చేశారు. ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్యే కాకర్ల సహకారంతో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కావలిటౌన్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి) హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం వెంగళరావునగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాష, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, చేవూరు ప్రభయ్య, విజయ్ దేవరకొండ, జాగో సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ జమీర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మండల పొదుపు సమాఖ్య సమావేశం

కొండాపురం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొదుపు గ్రూపులకు సంబంధించి మండల సమైక్య సమావేశం గురువారం కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఏపీఎం కాంతారావు మాట్లాడుతూ పొదుపు గ్రూపులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వీవోఏలు గ్రామాల్లో సభ్యులకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో వింజమూరు సీడీపీవో పద్మజకుమారి, ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, జీ.సాధన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కుటుంబాలకు అండగా ఉంటాం..



మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని, మేకపాటిలతో మాట్లాడుతున్న పెద్దపాడు గ్రామ టీడీపీ నాయకులు

కలిగిరి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ కుటుంబాలకు తాము అండగా ఉంటామని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు,ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వారిద్దరూ కలిసి గురువారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బొల్లినేని స్వగ్రామమైన పెద్దపాడులో మాజీ సర్పంచి చావా బ్రహ్మనందనాయుడు తండ్రి కొండపనాయుడు మంగళవారం మృతి చెందారు.దీంతో చిన్నకర్మకు హాజరై నివాళులు అర్పించారు. అనంతరం కావలిముస్తాపురంలో విద్యుత్‌షాక్‌తో చనిపోయిన నంబూరి చెంచునాయుడు దశదినకర్మకు, సిద్దనకొండూరులో సీనియర్ నాయకుడు గంగినేని రంగారావు పినతల్లి అన్నపూర్ణమ్మ దశదినకర్మకు హాజరై నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలకు పార్టీ ఎళ్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో వీరిని పార్టీ సీనియర్ నాయకులు, పలువురు కార్యకర్తలు కలసి గ్రామ సమస్యలు, వర్తమాన రాజకీయాలపైనా చర్చించారు.

సాంకేతికతతో టీడీపీని ముందుకు నడిపించండి



తిమ్మసముద్రం సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి

జలదంకి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గంలో టీడీపీని ముందుకు తీసుకుపోవడంలో సాంకేతికతను జోడించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డితో కలసి గురువారం ఎమ్మెల్యే మండలంలోని తిమ్మసముద్రంలో నిర్వహించిన గ్రామకమిటీ సమావేశంలో పాల్గొని పార్టీ నాయకులకు, క్రియాశీలక సభ్యులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్డీఏకూటమి ప్రభుత్వం కేంద్రంలో, రాష్ట్రంలో చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివిధ రూపాలోనూ, సోషల్‌మీడియా ద్వారానూ ప్రజల చెంతకు తీసుకువెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వంటేరు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నిత్యం నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తీరుస్తున్నాడని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు టీ.మధుసూదనరావు, పీ.మధుమోహన్‌రెడ్డి, కంచర్ల వినోద్‌నాయుడు, పూనూరు భాస్కర్‌రెడ్డి, మునగాల తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో తండ్రికి నివాళి



రక్తదానం చేస్తున్న తలమంచి వంశీ

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండముడుసుపాలేనికి చెందిన తలమంచి వంశీ తనతండ్రి శ్రీను ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళిగా గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్‌కు వచ్చి రక్తదానం చేశారు. వర్ధంతి అంటే ఏవేవో కార్యక్రమాలు చేపట్టడం కాకుండా ఇలా రక్తదానం చేయటం ద్వారా యువతకు ఆదర్శంగా నిలవటం పట్ల బ్లడ్‌బ్యాంక్ డాక్టరు షాజుద్దీన్, కందుకూరు రెడ్‌క్రాస్ చైర్మన్ చెన్నారామాంజనేయులు వంశీని అభినందించారు.

పెరటితోటను పెంచుకోవాలి



కిచెన్ గార్డెన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌వో సుమాంజలి

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పెరటిలో కూరకాయలు, ఆకుకూరలను పెంచుకుంటే ఆరోగ్యకర ఆహారాన్ని తీసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ స్టేట్ అధికారిని సుమాంజలి అన్నారు. దగదర్తి మండలం పరిసేన్నపేటలో గురువారం టీం లీడర్ హరిచందన ఆధ్వర్యంలో గురువారం కాయగూరల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా పెరటితోటలు వాటి వలన వచ్చే లాభాలు, కల్తీ లేని ఆహారం తినడమే కాకుండా వ్యాపారం చేసుకునే విధానాని స్టేట్ అధికారి వివరించారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

లింగసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని షెడ్యూల్ కులాలకు చెందిన వారు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ మంజూరు చేసే రుణాలకు మే 13 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు వయోపరిమితి 21 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటో, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబరుతో సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంటు వద్ద అందచేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

కందుకూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు 1973-74 బ్యాచ్ పదవతరగతి విద్యార్థులు గురువారం కార్డ్‌లెస్ మైకు, యాంప్లిఫైర్ బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నరసింహరావు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ మైక్ సెట్‌ను పాఠశాలకు అందించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. వీళ్ల మాదిరిగానే మరికొందరు ముందుకు వస్తే పాఠశాల ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మంచిరాజు మురళి, దొనపల్లి రమేష్, ఎస్కే సందానీబాషా, అక్కల ఉమామహేశ్వరరావు, ముచ్చెలి ఉమామహేశ్వరరావు, బొమ్మిశెట్టి కోటేశ్వరరావు, గోనుగుంట సుబ్రహ్మణ్యం, ఉరిమి వెంకటసుబ్బారావు, ఏకాంబరం సత్యనారాయణ, ఉపాధ్యాయులు రమణయ్య, పెరుగు ప్రసాదు, గుడ్లూరి వెంకటేశ్వరరావు, శ్రీనిధి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



పెరిగిన ధరలతో నత్తనడకన జరుగుతున్న ఇంటి నిర్మాణం

ఇళ్లు కట్టేదెలా.. ?

- నింగినంటుతున్న నిర్మాణ సామగ్రి ధరలు
- నిర్మాణదారులపై భారం

సంగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగానికి ఎంతో అవసరమైన సిమెంట్, ఐరన్ ధరలు నింగినంటుతుండడంతో ఇళ్ల నిర్మాణాలు ఎలా చేపట్టాలా అని నిర్మాణదారులు మదనపడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బస్తా సిమెంట్ రూ. 350, టన్ను ఐరన్ రూ. 54 వేల నుంచి 55 వేలు పలుకుతోంది. జిల్లాలో ప్రస్తుతం పల్లె పండుగ పథకంలో సిమెంట్ రహదారులు, డ్రైనేజి కాలువల నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అదేవిధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజనతోపాటు, వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిన పేదల ఇళ్లు పూర్తిచేయడానికి కూటమి ప్రభుత్వం అదనపుసాయం ప్రకటించింది. ఇసుక మాత్రం ఉచితంగా లభిస్తుంది. ఇసుక లభ్యత ఉన్నా, సిమెంట్, స్టీల్ ధరలు పెరగడంతో నిర్మాణదారులపై భారం పడింది. ప్రభుత్వ కాలనీ లబ్ధిదారులు సైతం ముందుకు రావడంలేదు. కాగా, జూన్ 12వ తేదీ నాటికి ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు పూర్తిచేసి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా ఆశించిన స్థాయిలో నిర్మాణాలు జరగడం లేదు. దీంతో గృహ నిర్మాణశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సోమశిల నీటిమట్టం 51.438 టీఎంసీలు

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 51.438 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 30 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



బోసిపోయిన నీలగిరి సంఘం కూడలి



మూలపేట రామయ్యబడి రోడ్డు



నగరంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో నిర్మానుష్యంగా రహదారి



సన్ ఫ్లాక్ !

సూరీడు సుర్రుమంటున్నాడు. ఎండవేడిమి భరించలేక వృద్ధులు, పిల్లలు అల్లాడుతున్నారు. ఇక రోజువారి పనుల కోసం ఇళ్లలో నుంచి బయటకు వచ్చేవారు వడగాలులకు బెంబేలెత్తిపోతున్నారు. ఎన్ని శీతలపానీయాలు తాగినా దాహం తీరకపోవడంతో అల్లాడుతున్నారు. దీంతో పనులకు వెళ్లేందుకు కూడా సాహసం చేయలేక ఇళ్లలోనే ఉండిపోతున్నారు. ఎంత తీవ్రత నేపథ్యంలో రహదారులు, ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటోందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

మలేరియాతో తస్మాత్ జాగ్రత్త

- దోమల వల్ల ప్రబలే ప్రాణాంతక వ్యాధి
- జిల్లాలో తగ్గుముఖం
- అయినా అప్రమత్తత అవసరం
- దోమల నివారణతోనే సాధ్యం
- ప్రైవేట్‌లో ఆసుపత్రుల్లో ఎక్కువగా కేసులు
- నేడు ప్రపంచ మలేరియా నివారణ దినం



ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని ఒలకబోయిస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాలో పల్లెలతో పోల్చితే పట్టణ ప్రాంతాల్లో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు తదితర పట్టణాల్లో పూర్తి స్థాయిలో దోమల నివారణ జరగక పోవడంతో దోమల విజృంభణ కారణంగా వ్యాధిగ్రస్తులు నమోదవుతున్నాయి. అదేవిధంగా అటవీ ప్రాంతాలకు సమీపాన ఉండే సీతారామపురం, మర్రిపాడు, దుత్తలూరు, ఉదయగిరి, రాపూరు తదితర మండలాల్లోనూ మలేరియా కేసులు నమోదవుతున్నారు. పల్లెల్లో నూ పారిశుధ్యలేమితో దోమలు బెడద ఎక్కువగానే ఉంటోంది. దోమల నివారణ కోసం నిర్దేశించిన ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం కూడా మొక్కుబడిగా మారింది.

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : దోమల వల్ల సోకే ప్రాణాంతక వ్యాధుల్లో మలేరియా ఒకటి. ఒకప్పుడు ఈ వ్యాధిసోకితే ప్రాణాలు కాపాడు కోవటం కష్టమయ్యేది. కానీ, ప్రస్తుతం ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి రావడంతో అవసరమైన చికిత్సలు అందుతున్నాయి. అయినా నేటి సమాజంలో అన్నీ ప్రాంతాల్లో దోమలు దండయాత్ర చేస్తుండటంతో మలేరియా వ్యాధిని అలక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం కేవలం ఒక్క మలేరియా కేసు మాత్రమే నమోదయింది. అయితే ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రం వీటి ఇప్పటి వరకు 75 కేసులు ఉన్నట్లు సమాచారం. 1898లో సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త భారతదేశంలో పరిశోధనలు చేసి మలేరియా వ్యాధిని నిర్ధారించారు. ఇందుకుగాను 1902లో ఆయనకు నోబెల్ బహుమతి లభించింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 25వ తేదీని మలేరియా నివారణ దినంగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.



మలేరియా అంతం మనతోనే అన్నినాదాన్నిచ్చింది.

ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలి : డీఎంహెచ్‌వో

జిల్లాలోని ప్రతీ ఒక్కరు మలేరియా వ్యాధి విషయంలో జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సూచించారు. ఆమె కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అనుమానిత మలేరియా బాధితులు దగ్గరలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకుని వ్యాధినిర్ధారణ అయితే చికిత్సలు పొందాలన్నారు. చిన్న పిల్లలు, గర్భిణులకు ఈ వ్యాధి మరింత ప్రమాదకరమని చెప్పారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. మలేరియా నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఎం హెచ్‌వో డాక్టర్ ఖాదర్ వలి, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, డెమో కనకరత్నం, ఏఎంవో నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.



మలేరియా నివారణ పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు

ముందస్తు జాగ్రత్తలు ఇలా..

- లార్వా దశలోనే దోమల నివారణకు చర్యలు చేపట్టాలి
- మలాథియాన్, సింథటిక్ పైరత్రాయిడ్, డీడీటీ వంటి దోమల మందును మురికి గుంతల్లో పిచికారీ చేయాలి.
- ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమల నివారణకు పొగ పెట్టాలి.
- ఇంటిలోపల, బయట నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- దోమతెరలు వాడాలి. ఇంటి కిటికీలు, తలుపులకు మెష్‌లు బిగించుకోవాలి.
- తాగి వదిలేసిన కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, పనికిరాని వస్తువులలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- ఎయిర్‌కూలర్లు, ఫ్లవర్‌వాజ్, పూలకుండీలలో నీటిని తరచూ మార్చాలి.

మలేరియా వ్యాధిగ్రస్తుల గణాంకాలు

సంవత్సరం	వైద్యశాఖ నిర్ధారణ	ప్రైవేటు ఆసుపత్రి
2021	12	226
2022	3	205
2023	1	141
2024	6	120
2025	1	75

(ఇప్పటి వరకు)



నివారణ చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో మలేరియా నివారణ చర్యలు తీసుకుంటున్నాం. నాలుగు రకాల ప్లాస్మోడియం క్రిముల ద్వారా మలేరియా వ్యాధి సోకుతుంది. దోమల కుట్టకుండా ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే కాలువలు, చెరువుల్లో దోమల నిర్మూలనకు గంబూజియా చేపలను వదలటం జరిగింది. సమస్యాత్మక 209 గుంతలను గుర్తించి అక్కడ దోమల నివారణకు చర్యలు చేపడుతున్నాం. ఫాగింగ్ మిషన్‌లు కూడా పంపిణీ చేశాం. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. మలేరియా దినోత్సవం సందర్భంగా అన్నీ పీహెచ్‌సీలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- హుస్సేనమ్మ (జిల్లా మలేరియా నివారణ అధికారి)

రేపు దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న క్రికెట్ ప్రాంగణంలో శనివారం దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం కార్యదర్శి పీ మనోహర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ సంఘం సహకారంతో జరిగే ఈ ఎంపికలకు ఫిజికల్ డిజేబిలిటీ, బ్లైండ్, వీల్‌చెయిర్, డెఫ్ కేటగిరీల్లోని క్రీడాకారులు హాజరు కావచ్చని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌తో పాటు వైట్ డ్రెస్ కోడ్, క్రికెట్ కిట్‌తో సంబంధిత తేదీ ఉదయం 9 గంటల్లోపు హాజరు కావాలని సూచించారు. జిల్లాకు ఎంపికైన క్రీడాకారులు జిల్లా పోటీలతోపాటు, రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పగిలిన రాళ్లపాడు-రోళ్లపాడు పైపులైన్

- 48 గ్రామాలకు ఆగిన మంచినీటి సరఫరా

లింగసముద్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో లింగసముద్రంలో రెండు చోట్ల రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం ప్రధాన పైపులైను పగిలిపోయింది.దీంతో లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని 48 గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. బుధవారం సాయంత్రం గ్రామంలోని పెట్రోలు బంకు వద్ద, గొల్లపాలెం వద్ద కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు మెషిన్‌తో గుంతలు తీస్తుండగా, పైపులైన్‌కు తగిలి పగిలి పోయింది.దీంతో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నీరు వరదలా ప్రవహించింది.గురువారం ఉదయం సిబ్బంది పైపులైన్‌కు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు.ఈ పనులు రాత్రికి పూర్తవుతాయని వారు చెప్పారు. సంబంధిత అధికారులు, పథకం నిర్వాహకులు స్పందించి శుక్రవారం నీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

అతిథి అధ్యాపకుల కొనసాగింపు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను వేసవి సెలవుల విరామం అనంతరం 2025-26 విద్యాసంవత్సరానికి ఏడాదిపాటు కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలోని వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న 36 మంది అతిథి అధ్యాపకులను మరో ఏడాదిపాటు కొనసాగించనున్నారు. వీరంతా ప్రభుత్వ నిబంధనలకు లోబడి కళాశాలల్లో విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సహకార రంగంలోనే షుగర్ ఫ్యాక్టరీని కొనసాగించాలి

కోవూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కోవూరు చక్కెర కర్మాగారాన్ని సహకార రంగంలోనే కొనసాగించాలని అఖిల భారత చెరకు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రన్ డిమాండు చేశారు. చక్కెర ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం జరిగిన చెరకు రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగంలోనే చక్కెర ఫ్యాక్టరీల్ని నడుపుతుండగా ఆంధ్రలో సహకార రంగానికి ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. చక్కెర కర్మాగారం కొనసాగింపునకు కోవూరు రైతులు సాగిస్తున్న ఆందోళన ప్రశంసనీం అని కొనియాడారు. చెరకుకు మద్దతు ధర టన్నుకు రూ.5500 చేయాలన్నారు. కేంద్రం స్వామినాథన్ కమిషన్ నిర్ణయాల్ని పట్టించుకోవడం లేదని చెప్పారు. అనంతరం తమిళనాడు చెరకు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. కోవూరు చక్కెర కర్మాగారం యజమానులు రైతులే అని, ఫ్యాక్టరీపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కులేదన్నారు. సహకార రంగంలోనే ఫ్యాక్టరీని కొనసాగించేందుకు రైతులందరూ ఐక్యంగా పోరాడలన్నారు. చెరకు రైతుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు రఘురామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెరకు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కర్రి అప్పారావు, రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎం సూర్యనారాయణ, నాయకులు జొన్నలగడ్డ వెంకమరాజు, పులి శ్రీరాములు, మూలి వెంగయ్య, గోనె దయాకరరావు, గండవరపు శేషయ్య, ప్రసాదరెడ్డి, హనుమంతరావు, మల్లికార్జునరెడ్డి, బాబు పాల్గొన్నారు.

29 నుంచి అంగ్రు వజ్రోత్సవాలు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(అంగ్రు) ఆవిర్భవించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గుంటూరు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లాంఫాంలో ఈ నెల 29 నుంచి వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లలితా శివజ్యోతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండ్రోజులు జరిగే ఈ కార్యక్రమంలో చిన్న కమతాల్లో సుస్థిరమైన నికర ఆదాయం పొందగలిగే సాంకేతిక పరిజ్ఞానంపై సదస్సు ఉంటుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు అనుబంధ శాఖల సాంకేతికతకు సంబంధించిన ప్రదర్శనలు ఉంటాయని, ఆసక్తి కలిగిన రైతులు 9989623828, 7981644675 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కేవీకే నుంచి రెండు బస్సులను ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

29లోగా డీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : డీఎడ్ 2023-2025 బ్యాచ్ విద్యార్థులు 4వ సెమిస్టర్ పరీక్షలకు ఫీజులను ఈనెల 29వతేదీలోగా చెల్లించాలని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు నాలుగు సబ్జెక్ట్‌లకు రూ.250, మూడు సబ్జెక్టులకు రూ.175, రెండు సబ్జెక్టులకు రూ.150, ఒక్క సబ్జెక్ట్‌కు రూ.125 చొప్పున సంబంధిత తేదీలోగా చెల్లించాలన్నారు. అపరాధ రుసుము రూ.50తో మే 7వతేదీలోగా చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాల ని కోరారు.

ఓపెన్ స్కూల్ రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు అవకాశం

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు వారికి వచ్చిన మార్కులపై సందేహాలుంటే రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో బాలాజీరావు మరో ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి మే 5వతేదీ వరకు ఏపీఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి సబ్జెక్ట్ జవాబుపత్రం రీకౌంటింగ్ కు రూ.200, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించాలన్నారు. అలాగే రెండు విభాగాల్లోనూ మే 19 నుంచి 24వతేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు, మే 26 నుంచి 30వతేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 26 నుంచి మే 5లోగా ఫీజులు చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు అభ్యసన కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్స్ నుంచి హెడ్‌మాస్టర్ పదోన్నతి కోసం సీనియారిటీ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈవో ఇంకో ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాపై అభ్యంతరాలుంటే శనివారం సాయంత్రం 5 గంటల్లో తగిన ధ్రువపత్రాలతో తెలియచేయవచ్చన్నారు.

నేటి నుంచి నోషనల్ ఖాతాల స్పెషల్ డ్రైవ్

- జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 95 వేలకుపైగా ఉన్న నోషనల్ ఖాతాల పరిష్కారానికి శుక్రవారం నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. 1,84,298 సర్వే నెంబర్లలోని 95,060 నోషనల్ ఖాతాలకు సంబంధించి ప్రతిరోజూ జిల్లాలోని నాలుగు డివిజన్ల నుంచి రెండేసి మండలాల చొప్పున మొత్తం రోజుకు 8 మండలాలకు సంబంధించిన నోషనల్ ఖాతాలను పరిశీలిస్తామని చెప్పారు. ముఖ్యంగా అసైన్డ్ భూములు, రిజిస్టర్డ్ భూములు, చుక్కల భూములు, పౌతి (మరణించిన వారి సంబంధించిన) సాదా బైనామా సంబంధించిన నోషనల్ ఖాతాలను పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తామని తెలిపారు. ఒక్క సాదా బైనామా భూములను నోషనల్ ఖాతా నుంచి తప్పించేందుకు ప్రస్తుతం అవకాశం లేదన్నారు. మిగిలిన వాటికి సంబంధించి నోషనల్ ఖాతా సమస్యలను పరిష్కరించే వీలుందన్నారు. రైతులు ఒక్కరుగా వారి సమస్యల పరిష్కారం కోసం తిరగడం కాకుండా ఆయా మండలాల్లోని అన్నీ నోషనల్ ఖాతాలను సాధ్యమైనంత వరకు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇందువల్ల దాదాపు 2,37,000 మంది రైతులు సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. తొలిరోజు పైలట్ ప్రాజెక్టుగా 8 మండలాల నోషనల్ ఖాతాలను పరిశీలించి ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. తద్వారా అన్నీ మండలాల్లోని నోషనల్ ఖాతాల సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ఉగ్రదాడిపై ఆగ్రహం

- న్యాయవాదుల నిరసన
- కొవ్వొత్తులతో మృతులకు నివాళి

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ న్యాయవాద పరిషత్ అధ్వర్యంలో గురువారం న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రాంగణంలో నిరసన తెలియజేశారు. ముష్కరుల దాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. దాడికి పాల్పడిన వారిని భారత ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దామా ఢమరేశ్వర్, వైవీ సురేష్, కుడుముల రవికుమార్, షేక్ నన్నేసాహెబ్, వేలూరు రంగారావు, పీసీ కృష్ణయ్య, శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు. కాగా, న్యాయవాదులు కోర్టు మెయిన్ గేట్ వద్ద సాయంత్రం కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులు అర్పించారు. భవిష్యత్తులో ఇలాంటి ఉగ్రదాడులు జరగకుండా కేంద్రం గట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కుడుముల రవికుమార్, ఎస్ రామకృష్ణ ప్రసాద్, జల్లి పద్మాకర్, జీ బాల సుబ్రహ్మణ్యం, పీ హర్షవర్ధన్ రెడ్డి, ఎస్ అంకయ్య, పీ శంకరయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పాక్ జెండాను దహనం చేసిన బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల నేపథ్యంలో ఢిల్లీలో పాక్ హైకమిషన్ సంబరాలు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు గురువారం నగరంలోని మూలాపేట అలం కార్ సెంటర్‌లో పాక్ జాతీయ జెండాలను దహనం చేశారు. నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ ఉగ్రవాదులు మతం ఎంచుకొని కాల్పులు జరపడం, పాక్ సరిహద్దులో యుద్ధ సన్నాహాలు చూస్తుంటే భారత్‌లోని హిందువులపై ఇస్లామిక్ తీవ్ర వాదులు ద్వేషంతో ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాలు హర్షణీయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థలను పాక్ ప్రభుత్వం, పాక్ సైన్యం పెంచి పోషిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, పద్మావతి, నాగలక్ష్మి, అల్లూరు నాగేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయ భవనం

రాపూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరి కూలి పోయే స్థితిలో ఉంది. ఆదివారం సాయంత్రం గ్రంథాలయంలోని స్లాబు పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఆ సమయంలో గ్రంథాలయంలో తక్కువ మంది పాఠకులు ఉండడంతో ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9,317
వెండి కిలో ధర	రూ. 100,500
వెండి ఒక గ్రాము	రూ.103.50

వెలగని హైమాస్టు లైట్లు

● ప్రయాణికులకు తప్పని పాట్లు

మనుబోలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి పరిధిలోని వీరంపల్లి క్రాస్‌రోడ్డు ప్రాంతంలో ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లు వెలగడం లేదు. ఈ సమస్యతో రాత్రి సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించక ప్రమాదాలకు గురిఅవుతున్నారు. ఈ ప్రాంతం నుంచి అటు నెల్లూరు- గూడూరు మార్గాల్లో.. మరోపక్క పొదల కూరు-మనుబోలు మండలాల ప్రజలు ఈ కూడలి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే కాగితాలపూరు క్రాస్‌రోడ్డులోనే ఇదే పరిస్థితి నెలకొంది. రెండు ప్రాంతాల్లో గతంలో పనిచేసిన ఎస్‌ఐ ఈ ఐమాస్టు లైట్లను వేయించారు. వీటిపైన సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం తో కొద్ది నెలలుగా లైట్లు వెలగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద వెలగని లైట్లు

కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన



కోవూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కోవూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ రాష్ట్రం పహల్గాం ప్రాంతంలో జరిగిన దాడికి నిరసనగా పట్టణంలో గురువారం రాత్రి కూటమి నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. తాలూకా ఆఫీసు కూడలి నుంచి బజారు కూడలి వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. పాక్ దుశ్చర్యల్ని నిరసిస్తూ నినదించారు. ప్రదర్శనలో మల్లారెడ్డి, గాదిరాజు చక్రవర్తి, రఘురామయ్య, పొబ్బారెడ్డి మల్లికార్జునరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో..

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): పహల్గాం దాడికి నిరసనగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. అలాగే వాసవీ క్లబ్ సభ్యులు చెన్నూరు రోడ్డుమీదుగా బస్టాండ్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సిద్దన మనోహర్‌రెడ్డి, నాయకులు పెంచల ప్రసాద్, రత్నప్రసాద్, బీజేపీ కార్యకర్తలు, వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం: నాయకుల నిరసన ర్యాలీ

దేశానికి పంచాయతీలే పట్టుగొమ్మలు : ఎంపీడీవో



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జడ్పీటీసీ పోలయ్య

సైదాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దేశానికి పంచాయతీలే పట్టుగొమ్మలని ఎంపీడీవో పురుషోత్తం శివకు మార్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జడ్పీటీసీ పోలయ్య మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా గ్రామాలకు బదలాయించిన 29శాఖల సిబ్బంది పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం కశ్మీరులో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతూ రెం డు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అ ర్పించారు. కార్యక్రమంలో ఏవో మురళీ, ఈవో పీఆర్డీ రాఘవేంద్ర, ఏపీఎం చంద్రశేఖర్, కార్య దర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించండి

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి



ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

మనుబోలు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రైతులు వేసవిలో వరికి బదులుగా రెండోపంట కింద ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. స్థానిక రైతుసేవా కేంద్రం-2లో గురువారం రైతులతో నిర్వహించిన ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డిని శాలువా, బొకేలతో సన్మానించి రైతులతో మాట్లాడారు. మట్టి పరీక్షలు చేయిస్తే భూమిలో పోషకాల మోతాదు తెలుస్తుందన్నారు. రైతులు పెసలు, నువ్వులు లేదా పత్తి పంటను సాగుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, శివనాయక్‌లు, పొదలకూరు టెక్నికల్ ఏవో శ్రీదేవి, ఏవో జహీర్, ఏఈవో కళారాణి, రామకృష్ణయ్య, హనుమంతనాయుడు పాల్గొన్నారు.

టోర్నమెంట్ నిర్వహణపై ప్రత్యేక సమావేశం

వెంకటాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహణపై గురువారం విక్రమ సింహపురి యూనివర్సిటీలో వీసి అల్లం శ్రీనివాసరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈనెల 30 నుంచి వీఎస్ యూలో జరిగే ఈ పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. క్రీడా ప్రాంగణంలో ఏర్పాట్లు, హాస్టల్ వసతులు, భద్రత, ఆరోగ్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ సీహెచ్ వెంకట్రాములు, ప్రొఫెస ర్లు అందె ప్రసాద్, ఎం.హుస్సేనయ్య, విజయానంద కుమార్ బాబు, సుజాఎస్ నాయర్, హనుమారెడ్డి, మధుమతి, ఎన్ఓ గోపాల్, అల్లం ఉదయ్ శంకర్, పి.ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సాయిప్రసాద్‌రెడ్డి, సుజయ్‌కుమార్ ఉన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీమహావిష్ణువు విహారం

సైదాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కృష్ణారెడ్డిపల్లి వైకుం ఠపురం శ్రీమహావిష్ణువు, మహాలక్ష్మీ ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం రథోత్సవం, రాత్రికి అశ్వ వాహన సేవా కార్యక్రమాలు జరుగుతాయ ని నిర్వాహకులు తెలి పారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సూర్యప్రభ వాహనంపై స్వామివారు

వరదలు వస్తే సోమశిలకు ముప్పు తప్పదు

● బలహీనంగా పొర్లుకట్టలు ● వైసీపీ పాలనలో నామమాత్రంగా మరమ్మతులు

అనంతసాగరం ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి పొర్లుకట్టల ప్రాధాన్యత ఎంతో కీలకం. అయితే గతంలో (2020-2021)లో ఎగువ నుంచి సోమ శిలకు వచ్చిన భారీ వరదల కారణంగా డ్యాం కట్టడాలు ధ్వంసమైన విషయం తెలిసిందే. కాగా, జలాశయం ముందువైపు నది అడుగు భాగం నుంచి నిర్మించిన పొర్లు కట్టలు, రివిట్‌మెంట్ నిర్మాణాలు దెబ్బతిన్నాయి. అవి అత్యవసరంగా చేయాల్సిన పనులు కాగా, గత వైసీపీ హయాంలో నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. ఈక్రమంలో రాబోవు వర్షాకాలంలో ఎగువ నుంచి భారీ వరద వస్తే ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ఇక పవర్‌ప్లాంట్ నుంచి డెల్టాకు నీరు సరఫరా చేసే కాలువ గట్టు, క్యాంపు కార్యాలయ సమీపంలో పొర్లుకట్టలు కోతకు గురయ్యాయి. అప్రాతంలో మట్టికట్టల నిర్మాణ పనులు చేశారు. అయితే రాళ్లతో రివిట్‌మెంట్ పనులు పూర్తిచేయలేదు. 11,12 క్రస్ట్‌గేట్ల నుంచి నీరు సరఫరా చేసే బ్రిడ్జికి ముందు ఉన్న నిర్మాణాలు రాళ్ల తేలి బలహీనంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆగస్టు నుంచి సోమశిలకు కృష్ణాజలాలు వచ్చే సూచనలు ఉండగా, అక్టోబరు, నవంబరు మాసాల్లో తుఫాన్ల ముప్పు ఉంటుంది. ఆ కారణంగా ఎగువ నుంచి భారీగా వరద వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పొర్లుకట్టల పటిష్టతకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రాళ్లుతేలి బలహీనంగా ఉన్న కట్ట

మహనీయుల్లారా.. మమ్మల్ని క్షమించండి !

● చెత్త కుప్పల్లో విగ్రహాలు ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

వెంకటాచలం, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి):చెముడుగుంట సమీపంలోని జాతీయ రహదారి పక్కనే చెరువు వద్ద ఉన్న చెత్తలో మహనీయుల విగ్రహాల ను పడేసి ఉన్నారు. మూడు రోజుల కిందట భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అమరజీవి పొట్టి శ్రీరాములు, స్వాతంత్ర్యం కోసం పోరాడిన మరికొందరు మహనీయుల విగ్రహాలను ఇక్కడ పారవేసి వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. అటుగా వెళ్లే ప్రజలు, వాహనదారులు వీటిని చూస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహనీయులను ఇలా పారవేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి విగ్రహాలను ఆ ప్రాంతం నుంచి మరో చోటుకు మార్చాలని కోరుతున్నారు.



చెత్తకుప్పలో ఉన్న విగ్రహాలు

ప్రతిభా విద్యార్థులకు ప్రోత్సాహకాలు, అభినందనలు

పొదలకూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పట్టణానికి చెందిన అమరావతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యధిక మార్కులతో ప్రతిభ చూపారు. ఇందులో పేట చైత్ర అనే విద్యార్థిని (591) సాధించింది. అలాగే ఆరుగురు 580కిపైగా మార్కులు, 550కి పైగా 31మంది, 500లకుపైగా 59మంది విద్యార్థులు సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో యాజమాన్యం కేక్ కట్ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.




పేట చైత్ర

● మొగళ్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

మొగళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 23మంది ఉత్తీర్ణత చెందారు. ఇందులో శివ హర్ష (515), షేక్.దిల్షాద్ (500) మార్కులు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

● ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక వీబీఆర్ హైస్కూల్ విద్యార్థులు వాకాటి నేత్ర (593), దాసరి హేమంత్ (593)లకు గురువారం ప్రోత్సాహక నగదుతో పాటు బహుమతులు అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన అభినందనసభలో చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ శైలజారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, ఏవో శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి):నరసాపురం ఎంవీఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో గుడి భార్గవ్ (593) మార్కులు సాధించాడు. విద్యార్థికి దాసరి సుహాసినీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయకుమార్ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా నెల్లూరులోని ఆమె నివాసంలో రూ.25వేల నగదు అందజేశారు. అలాగే 591మార్కులు వచ్చిన షేక్ నేహా ఫర్వాత్ (586), నెల్లూరు శ్రీలేఖకు అమ్మచారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు దొడ్ల మల్లికార్జున రూ.5వేలను అందజేశారు. కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, పొన్నెబోయిన చెంచుకి షోర్‌యాదవ్, ముంగర గోపాల్, జనసేన నాయకుడు హరికుమార్‌రెడ్డి, ఎంఈవో సునీల్, ప్రధానో పాధ్యాయులు నాగేశ్వరరావు, ముజీబ్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీబీఆర్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి



నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యే రాక

మనుబోలు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం చెర్లోపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు తరలిరావాలని పేర్కొన్నారు.

వితంతువులకు పింఛన్లు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వితంతు పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే పింఛన్లు పొందుతున్న భర్తలు 1-12-2023 నుంచి 31-10-2024లోపు చనిపోయిన వారి భార్యలకు మాత్రమే మంజూరు దరఖాస్తునకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని ఎంపీడీఓ శ్రీహరి గురువారం తెలిపారు. ఈ మేరకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కావలిలో మధుసూదన్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన కావలి నివాసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సోమిశెట్టి మధుసూదన్ మృతదేహాన్ని గురువారం విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. కావలిలోని ఆయన స్వగ్రహంలో జరిగిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడసానుభూతిని తెలిపారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా శోకాన్ని మిగిల్చిందన్నారు. ఆయన వెంట వర్సిటీ రిజిస్ట్రార్ సునీత ఉన్నారు.

షిరిడీ సాయి మందిరంలో ప్రత్యేక పూజలు



పండ్లు , పూలాలంకరణ మధ్య స్వామివారు

పొదలకూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిరిడీ సాయిమందిరంలో గురువారం పూలు, పండ్లతో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు స్వామి, కమలపండ్లు, పుచ్చకాయల ముక్కలు, తొక్కలతో సుందర ఆకారాన్ని తీర్చిదిద్ది.. అందులో సాయిబాబా చిత్రాలను ఉంచారు. ఈ దృశ్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది.

పాడి రైతులకు లబ్ధి చేకూర్చాలి

కోవూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పాల దిగుబడి పెంచేందుకు నియోజకవర్గ పరిధిలోని పాడి రైతులకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. గురువారం నెల్లూరులోని ఆమె స్వగృహంలో పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో పశువుల దాణాకు సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. మినీ గోకులాల్ని సత్వరమే నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక నాయ కుల సమన్వయంతో రైతుల సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ అధికారులు మురళీకృష్ణ, ప్రసన్న ఆంజనేయరెడ్డి, కృష్ణమౌర్య, పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

సీతారామపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):అయ్యవారిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో గురువారం 1980-1985 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 33 మంది విద్యార్థులు కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువు ఉపాధ్యాయుడు కృష్ణయ్యను సన్మానించారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు 689 బేళ్లను తీసుకొని రాగా 15 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 469 బేళ్లు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 220 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 220 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

● ఐదుకేజీల సరుకు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సిటీ డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి నెల్లూరు నగరంలోని కొందరు వ్యక్తులకు విక్రయిస్తున్న ముఠాను సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను సంతపేట స్టేషన్‌లో నగర డీఎస్పీ పీ సింధుప్రియ గురువారం వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం బరంపూర్‌కు చెందిన రంజిత్ నాయక్ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ ప్రాంతానికి వచ్చాడు. చెడు వ్యసనాలకు బానిసైన రంజిత్ సులభంగా డబ్బు సంపాదించడం కోసం గంజాయి విక్రయాన్ని మార్గంగా ఎంచుకున్నాడు. ఒడిశాలో కేజీ గంజాయిని రూ.5వేలకు కొనుగోలు చేసి నెల్లూరుకు తీసుకువచ్చేవాడు. నగరంలోని ప్రగతినగర్‌కు చెందిన షేక్ హుస్సేని అలియాస్ హుస్సేన్, షేక్ రఫీ అలియాస్ గాంధీ, నారాయణ రెడ్డిపేటకు చెందిన రాపర్తి అలియాస్ నాపర్తి భాను ప్రకాష్, కిసాన్‌నగర్‌కు చెందిన పూడి వంశీకృష్ణకు ఆ కేజీ గంజాయిని రూ.20 వేలకు విక్రయించే వాడు. వారు గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి ప్యాకెట్ రూ.300 చొప్పున విక్రయిస్తూ కేజీ గంజాయిని రూ.50 వేలకు అమ్ముకొనేవారు. ఇలా జరుగుతున్న గంజాయి విక్రయాలపై పక్కా సమాచారం అందుకున్న సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథ రామయ్య నిందితులపై నిఘా ఉంచారు. బుధవారం నగరంలోని పెన్నా నది పొర్లుకట్ట వద్ద రంజిత్ నాయక్ గంజాయిని మిగిలిన నలుగురికి విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముఠాను పట్టుకున్న పోలీసులను డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ దశరథ రామారావు, ఎస్ఐ బాలకృష్ణ, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో నుంచి పడి చిన్నారి దుర్మరణం

కలువాయి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి కిందపడి చిన్నారి దుర్మరణం చెందిన సంఘటన గురువారం సాయంత్రం కలువాయి మండలం వెరుబొట్లపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చేజర్ల మండలం చిత్తలూరుకు చెందిన సుస్మిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని బుధవారం అనంతసాగరం మండలం చిలకలమర్రిలో బంధువుల వివాహానికి వెళ్లింది. అక్కడనుంచి గురువారం ఉదయం కలువాయిలోని అమ్మగారి ఇంటికి పిల్లలతో వచ్చింది. సాయంత్రం ఇద్దరు పిల్లలతో కలసి సుస్మిత కలువాయి నుంచి చిత్తలూరుకు ఆటోలో బయలుదేరింది. వెరుబొట్లపల్లి రోడ్డు దగ్గరకు వచ్చేసరికి ఆటోలో ఉన్న చిన్న కుమారుడు ధనుష్ (3) జారికింద పడిపోయాడు. వెంటనే గాయపడిన ధనుష్‌ను వైద్యం కోసం ఆదూరుపల్లికి తీసుకుపోగా అక్కడ మృతిచెందాడు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న వీఆర్వో

కొండాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని రామానుజపురంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. బాధితుడు బండ్లమూడి మధు కథనం మేరకు, బుధవారం సాయంత్రం తాము బంధువులపెళ్లికి ఊరికివెళ్లగా ప్రమాదం చోటుచేసుకున్నదన్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.20 వేలు విలువచేసే వంటసామగ్రితో పాటు నగదు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయన్నారు. కట్టుబట్టలతో మిగిలామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు. దగ్ధమయిన ఇంటిని వీఆర్‌వో మహేష్ పరిశీలించారు.

చలివేంద్రాల జాడేది!?

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండు వేసవి దృష్ట్యా గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ పంచాయతీల్లో వాటి జాడే కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధా న కూడళ్లు, జనసంచార ప్రాంతాల్లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకొనే నాథులే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నుంచి వినతులు అందుతున్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్ట డంలో విఫలమయ్యారనే చెప్పుకోవచ్చు. దీంతో పంచాయతీల్లో దాహం తీర్చే పరిస్థితులు లేకుండా పోయాయని ప్రజలు, ప్రయాణీకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు పంచాయతీల్లో నిధుల లేమితో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ముందుకు రావడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కనీసం దాతల సహకారంతోనైనా వాటిని ఏర్పాటుచేసి ప్రజల దాహం తీర్చే చర్యలు చేపట్టక పోవడంతో లక్ష్యం నీరుగారి పోతుంది.

మొక్కుబడిగానే: జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం పదుల సంఖ్యలో అవి కనిపిస్తున్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసినవే కనిపిస్తుండడం విశేషం. పంచాయతీల్లో అరకొర ఏర్పాటు చేసిన చలివేంద్రాలు మొక్కుబడిగా ఫోటోలకే పరిమితమయ్యాయి తప్ప పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజల దాహం తీర్చలేక అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. హడావిడిగా కుండలను పెట్టి చేతులు దులుపు కోవడంతో పేరుకే అన్న చందంగా మారి వెక్కిరిస్తున్నాయి. దీంతో అటుగా ప్రయాణాలు సాగించే ప్రజలు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చేసేదేమిలేక దుకాణాల వద్దకు పరుగులు తీసి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రధానంగా ఎండల ప్రభావం అధికంగా ఉండే మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో పరిస్థితి మరీ దారుణంగా కనిపిస్తుంది. ఉదయగిరి మండలంలో ఎలాంటి స్పందన కనిపించకపోవడంతో ఇటీవల గండిపాళెంలో జేఎంకే ట్రస్టు తరఫున చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారంటే అధికారుల పనితీరు ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. వింజమూరు పట్టణంలోను కేవలం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రెండు చలివేంద్రాలను నిర్వహిస్తున్నారు. అలాగే దుత్తలూరులో బీజేపీ తరఫున నిర్వహిస్తుండగా వరికుంటపాడు మండలం తూర్పుబోయమడగల, సీతారామపురం మండల కేంద్రంలో మాత్రమే పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలు కనిపిస్తున్నాయి. ఇంచుమించు అన్ని మండలాల్లోను ఇలాంటి పరిస్థితి నెలకొంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	218
కోడిగుడ్ల ధర (100):	420

మూలస్థానేశ్వరుడికి నేడు ప్రదోషకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోషకాల పూజలు జరుగుతాయని ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4.45గంటలకు నందీశ్వరుడికి తదుపరి మూలస్థానేశ్వస్వామికి అభిషేకాలు, పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి 7.45 గంటలకు చిన్న వెండి నంది వాహనంపై ప్రాకారోత్సవం జరుగుతుందని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

రేపు 'డీకేడబ్ల్యూ'లో మెగా జాబ్‌మేళా

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నై, శ్రీసిటీ, తడ ప్రాంతాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొని యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తార న్నారు. ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి, 27 ఏళ్ల వయసు నిండని అభ్యర్థులు, పూర్తి వివరాలతో మేళాకు హాజరు కావచ్చని తెలిపారు.

న్యూస్ బాక్స్

వేసవి సెలవుల్లో చిన్నారులు జాగ్రత్త

● సీడబ్ల్యూసీ చైర్మన్ మాధవి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎండలు తీవ్రంగా ఉన్నాయి, పిల్లలకు వేసవి సెలవులు ఇచ్చారు, ఈ తరుణంలో చిన్నారుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సీడబ్ల్యూసీ చైర్మన్ మాధవి పిలుపునిచ్చారు. గురువారం కొండాయపాలెంలో అబైండింగ్ ట్రస్ట్ కార్యాలయంలో బాలలకు పౌష్టికాహారం పంపిణీ జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులపై లైంగిక వేధింపులు జరిగితే 1098 నెంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబైండింగ్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ టైటాస్ నిర్మల్‌కుమార్, జయప్రకాష్, సిస్టర్ రమ, ఫాదర్ లివింగ్‌స్టన్, కాంత్రికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'మిరియాల'తో సంబంధం లేదు : ఆర్‌పీఐ

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌పీఐ పార్టీ పేరు, మంత్రి పేరు చెప్పి రుణాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకి పాల్పడుతున్న మిరియాల వెంకట రమణయ్యకు, పార్టీకి సంబంధంలేదని, అతన్ని పార్టీ నుంచి గతంలోనే బహిష్కరించామని ఆర్‌పీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోవూరు సురేష్ తెలిపారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌పీఐ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్థాపించిన పార్టీ అని, దాని పేరు చెప్పుకుని మోసాలకి పాల్పడితే వారిని చట్టపరంగా శిక్షించేంత వరకు వదలమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నంబూరు గణేష్, ఆరికొండ సురేష్, డొక్కా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఛాతీలోని ఇనుపరాడ్ తొలగింపు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి ఛాతీలోకి చొచ్చుకుపోయిన ఇనుప రాడ్‌ను నగరంలోని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి తొలగించారు. గురువారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కార్డియో థొరాసిస్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ లోకేశ్వరరావు, చీఫ్ ఆపరేటింగ్ ఆధికారి డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడారు. ఆత్మకూరుకు చెందిన షేక్ రియాజ్ (38) ఇంటిలో జామకాయలు కోస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ క్రమంలో ఇనుపరాడ్డు అతని ఛాతీలో దిగబడి భుజం నుంచి వెలుపలికి వచ్చింది. కిమ్స్ ఆసుపత్రికి తీసుకురాగా మూడు గంటలు శ్రమించి రాడ్‌ను తొలగించామని, రియజ్‌ను ప్రాణాపాయం నుంచి కాపాడామని వైద్యులు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేషయ్య, డాక్టర్ జగదీష్, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

గాయత్రిని ఉన్నత చదువులు చదివిస్తాం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని వీపీఆర్ విద్య పాఠశాలలో చదివి పదో తరగతిలో 587 మార్కులు సాధించిన విద్యార్థిని గాయత్రిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. గాయత్రి, ఆమె తల్లి ఝాన్సీ గురువారం ప్రశాంతిరెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. ఆ విద్యార్థిని ఉన్నత చదువుకు అయ్యే ఖర్చును తాము భరిస్తామమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాగా, కోవూరు నియోజకవర్గంలోని పాడి రైతులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులకు ఎమ్మెల్యే ప్రశాంతి సూచించారు. ఆమె నివాసంలో అధికారులతో గురువారం సమీక్షించారు. పశువుల దాణాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మినీ గోకులాలు త్వరగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఇందుకూరుపేట ఏడీ మురళీకృష్ణ, ప్రసన్నాంజనేయరెడ్డి, కృష్ణ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల కుదింపు?

- క్లస్టర్ల వారీగా ఏర్పాటు
- నగరంలో 166 కాస్తా 104కు తగ్గింపు
- ఏ,బి,సీ కేటగిరీలుగా ఉద్యోగుల విభజన
- మిగిలిన వారు వివిధ శాఖలకు కేటాయింపు..?
- మొదలైన కసరత్తు, మే రెండవ వారానికి స్పష్టత

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నడుస్తున్న సచివాలయాల స్వరూపంలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. పనితీరును మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. ఈ క్రమంలో నెల్లూరు నగరంలోని డివిజన్ సచివాలయాల సంఖ్యను కుదించేందుకు కార్పొరేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిపై మే రెండవ వారానికి స్పష్టత వచ్చే అవకాశం ఉందని సమాచారం. నగరంలో ప్రస్తుతం 166 సచివాలయాలుండగా వాటిని 104 క్లస్టర్లుగా కుదించి అందులోని ఉద్యోగులను ఏ,బీ,సీ కేటగిరీలుగా విభజించే ప్రక్రియ మొదలైంది. మిగిలిన ఉద్యోగులను వివిధ శాఖలకు కేటాయించే అవకాశాలున్నాయి. జనాభా ప్రాదిపతికన ఈ కసరత్తు జరుగుతోందని తెలిసింది.

నగరంలో 54 డివిజన్లు ఉండగా వాటిలో 166 సచివాలయాలను గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. వివిధ శాఖలకు చెందిన 10 మంది సెక్రటరీలతో ఉన్న ఆ సచివాలయాలను జనాభా ప్రాతిపదికన క్లస్టర్ వారీగా ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలో సచివాలయాల సంఖ్యను 104కు కుదించనున్నట్లు సమాచారం. 2,500 మంది జనాభా ఉన్న ప్రాంతాన్ని ఏ క్లస్టర్‌గా, 2,500 నుంచి 3,500 వరకు బీ క్లస్టర్, 3,500 పైన సీ క్లస్టర్‌గా విభజించి సరిహద్దులు నిర్ణయించే కసరత్తు జరుగుతోంది. ఇక, ఉద్యోగుల విషయానికి వస్తే ఏ క్లస్టర్‌లో ఆరుగురు, బీలో ఏడుగురు, సీ క్లస్టర్‌లో ఎనిమిది మందిని కొనసాగించే అవకాశం ఉంది. స్థానిక అవసరాలు, ప్రభుత్వ సేవలను పరిగణలోకి తీసుకుని అవసరమైన ఉద్యోగులను మాత్రమే క్లస్టర్లలో అందుబాటులో ఉంచనున్నారు.

భారీగా తగ్గనున్న ఉద్యోగులు

నగరంలోని 166 సచివాలయాల్లో 1660 పోస్టులుండగా ప్రస్తుతం 1286 మంది ఉద్యోగులే పని చేస్తున్నారు. సచివాలయాల పునర్వవస్థీకరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గనుంది. ఏ కేటగిరీ క్లస్టర్‌లో అడ్మిన్‌తోపాటు ఎడ్యుకేషన్, హెల్త్, రెవెన్యూ సెక్రటరీలు కచ్చితంగా ఉంటారని సమాచారం. ఇక ఆరో వ్యక్తిగా ప్లానింగ్, అమినిటీస్, శానిటేషన్ సెక్రటరీల్లో ఒకరిని ఎంపిక చేయనున్నారు. బీ కేటగిరీ క్లస్టర్‌లో 7వ ఉద్యోగిగా వెల్ఫేర్ సెక్రటరీని నియమించే అవకాశం ఉంది. ఇక, సీ కేటగిరీ క్లస్టర్‌లో 8వ సెక్రటరీగా మహిళా పోలీసు ఉంటారని తెలిసింది. మిగిలిన ఉద్యోగులను వివిధ శాఖలకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. దీనిపై స్పష్టత లేకపోవడంతో సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. అయితే సచివాలయాల స్వరూపంలో మార్పునకు సంబంధించిన కసరత్తు కార్పొరేషన్‌లో జోరుగా సాగుతోంది. ఇది మే రెండవ వారానికి తుది దశకు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే సచివాలయాల్లోని ఉద్యోగుల సీనియార్టీ ఆధారంగా ఉద్యోగోన్నతి కూడా కల్పించే అవకాశాలున్నట్లు తెలిసింది.



వావిలేటిపాడు సచివాలయం



ముష్కరుల దాడికి నిరసనగా గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు

ఉగ్రదాడికి నిరసన

నెల్లూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో అమాయకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను నిరసిస్తూ నగరంలో గురువారం రాత్రి పలుచోట్ల శాంతియుత ర్యాలీలు నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సంతాపం తెలుపుతూ కొవ్వొత్తులతో ప్రదర్శన జరిపారు. నెల్లూరు జిల్లా ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి గాంధీ బొమ్మ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అమాయకులపై దాడులు జరపడం దుర్మార్గమని ప్రింటర్స్ అసోసియేషన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లో స్థానికులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రదాడి అత్యంత హేయమైన చర్య అని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ప్రకృతిని ఆస్వాదించడానికి వచ్చిన అమాయకులు ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోవడం తీవ్రంగా కలచివేసిందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ముష్కరులను కఠినంగా శిక్షించాలని కోరారు.

అనుమతుల్లేకపోతే ఆపేయండి

● భవన నిర్మాణాలపై కమిషనర్ నందన్ ఆదేశం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 24,(ఆంధ్రజ్యోతి) : నగరంలో సిటీ ప్లానింగ్ అనుమతుల్లేకుండా జరుగుతున్న భవన నిర్మాణాలను ఆపేయాలని కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. గురువారం 2వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ప్రతీ భవనాన్ని పరిశీలించాలని సూచించారు. అనుమతులు తనిఖీ చేసి పర్మిషన్లు లేకపోతే నిర్మాణాల నిలుపుదల నోటీసులు జారీ చేయాలన్నారు. ఖాళీ స్థల యజమానులను గుర్తించి వీఎల్టీ వసూలు చేయాలన్నారు. కాలువల్లో మురుగు పారుదలకు ఎప్పటికప్పుడు పూడిక తీయాలని ఆదేశించారు. కాగా, కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన నందన్ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ స్రవంతితో మర్యాదపూర్వక భేటీ అయ్యారు. పాలనపరమైన అంశాలను చర్చించారు. ఎంహెచ్‌వో చైతన్య పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.



స్థానికుల ద్వారా సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

నీటి పన్ను కట్టించాలి: ఆర్డీవో అనూష

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా నీటి పన్ను చెల్లించే విధంగా జల వనరుల శాఖ అధికారులు, సాగునీటి సంఘం పాలక వర్గాలు బాధ్యత తీసుకోవాలని నెల్లూరు ఆర్డీవో అనూష సూచించారు. గురువారం నెల్లూరు రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నీటి విషయమై గ్రామ సభలు నిర్వహించాలని, బకాయిలన్నీ చెల్లించేందుకు రైతుల వెసులుబాటును బట్టి గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు అందు బాటులో ఉంటారని చెప్పారు. వీఆర్వోలు గ్రామ సభ నిర్వహణ బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు వైద్య పరీక్షలు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రంలో గురువారం దివ్యాంగ చిన్నారులకు వైద్య పరీక్షలు జరిగాయి. ముంబయికి చెందిన న్యూరోజన్ బ్రెయిన్ స్పైన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో డాక్టర్ సుచితా చౌదరి, డాక్టర్ సుశీల్ పాల్గొని నవజాత శిశువుల నుంచి 15 ఏళ్ల వయసున్న పిల్లల వరకు పరీక్ష నిర్వహించారు. న్యూరోలాజికల్ డిజార్డర్‌తో బాధపడే పిల్లలకు సెల్ థెరపీ, న్యూరో రిహాబిలిటేషన్ ద్వారా అందించే చికిత్సలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 70 మంది పిల్లలను పరీక్షించగా 40 మందికి మెరుగైన చికిత్స అందించాలని నిర్ణయించారు. రెడ్‌క్రాస్ పాలక మండలి కమిటీ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ జనార్దన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, సభ్యులు పాల్గొన్నారు.



దివ్యాంగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

టెన్త్‌లో 'ఎస్‌వీఆర్'కు ఉత్తమ ఫలితాలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎస్‌వీఆర్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన బీ తేజేశ్వరరావు 589, ఎస్ సంజన 575, పీ సుకీర్తి 575, ఏ భావన 562 మార్కులు సాధించారని చెప్పారు. తెలుగు, సోషల్ సబ్జెక్టుల్లో వందశాతం మార్కులతోపాటు వందశాతం ఫలితాలు సొంతం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

పదో తరగతి ఫలితాల్లో 'నారాయణ' అగ్రస్థానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు అగ్రస్థానంలో నిలిచాయని ఆ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వీ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. నగరంలోని రామలింగాపురం నారాయణ పాఠశాలలో గురువారం విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. జిల్లాలో గొల్ల దీక్షితప్రియ 598 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 595 మార్కులపైన 26 మంది, 550 మార్కులకుపైన 918 మంది, 500 మార్కులకుపైన 1405 మంది సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం, కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయచిహ్నం చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



రాష్ట్ర సదస్సుకు పీఆర్ అధికారులు, జడ్పీటీసీలు

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పంచాయతీరాజ్ (పీఆర్) దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రాష్ట్ర సదస్సుకు ఆ శాఖ జిల్లా అధికారులు, పలువురు జడ్పీటీసీలు హాజరయ్యారు. జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, డ్వామా పీడీ గంగాభవాని, కోవూరు కోట జడ్పీటీసీలు శ్రీలత, దాసరి కోటయ్య, కోవూరు, నాయుడుపేట, ఆత్మకూరు, జలదంకి, వెంకటాచలం ఎంపీపీలు పార్వతి, ధనలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకట రమణయ్య, మందా కవిత తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సులో పాల్గొన్న జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు, జడ్పీటీసీలు

'వీబీఆర్' విద్యార్థులకు సన్మానం

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ధనలక్ష్మీపురంలోని వీబీఆర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సత్కరించింది. 595 మార్కులు సాధించిన జ్వాల ప్రగ్నేష్, 594 మార్కులు సాధించిన తేజస్వి, 590కి పైగా మార్కులు సాధించిన ఏడు గురు విద్యార్థులకు విద్యాసంస్థ చైర్మన్ ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ కాటం శ్రీని వాసులురెడ్డి రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులు అందచేశారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

మేథా పాఠశాల విద్యార్థుల విజయం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మేథా పాఠశాల విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారని ఆ స్కూలు కరస్పాండెంట్ కొండారెడ్డి తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన పీ మేఘవర్షిని 582, ఎస్‌కే రెహమతున్నీసా 576, ఎస్‌కే సాబ్రీన్ 568, ఎస్‌డీ అబ్దుల్ సమద్, కే ఆదర్శ్ 561 మార్కులు సాధించారని చెప్పారు. అత్యుత్తమ విద్యా ప్రమాణాలతోనే ఈ మార్కులు సాధించామని, మున్ముందు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని సత్కరిస్తున్న పాఠశాల ప్రతినిధులు



కానిస్టేబుల్ మృతికి సంతాపం

నెల్లూరు(క్రైం) : కావలి రూరల్ కానిస్టేబుల్ ఎస్ నాగ రమేష్ మృతికి ఏపీ పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్ది పాటి ప్రసాదరావు, నాయకుడు వై శ్రీహరి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. నాగ రమేష్ అనారోగ్యంతో చెన్నైలో మృతి చెందారని తెలిపారు.



ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన కావలి వాసి మధుసూదన రావుకు గురువారం డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, ఆనం, సత్యకుమార్, ఎమ్మెల్యేలు నివాళులర్పించారు. ఆయన భార్యా పిల్లలు కశ్మీర్‌లో జరిగిన దాడుల సంఘటనలు తెలిపి కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని నాయకులు ఓదార్చారు.

\- కావలి, (ఆంధ్రజ్యోతి)







ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 25 ఏప్రిల్ 2025



వెదురుకుప్పం మండలం రెంటాలచేనులో రామకృష్ణారెడ్డి ఇల్లు



నివాళి

పద్మశ్రీ అందుకున్న రైతుబిడ్డ

- భాషా శాస్త్రవేత్త బండి రామకృష్ణారెడ్డి సేవలను గుర్తు చేసుకుంటున్న విద్యావేత్తలు
- హైదరాబాదులో కన్నుమూసిన వెదురుకుప్పం ప్రాంత వాసి
- ద్రావిడ వర్సిటీ తొలి రిజిస్ట్రార్‌గా సేవలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో బుధవారం కన్నుమూసిన వెదురుకుప్పం ప్రాంతానికి చెందిన భాషా శాస్త్రవేత్త పద్మశ్రీ బండి రామకృష్ణారెడ్డి సేవలను పలువురు గుర్తు చేసుకుంటున్నారు. కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయం తొలి రిజిస్ట్రార్‌గానూ చేసిన ఆచార్య బండి రామకృష్ణారెడ్డి(84) కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాదులోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్కడే ఆఖరి శ్వాస విడిచారు. ఈయన స్వస్థలం వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీలోని రెంటాలచేను. వీరిది వ్యవసాయ కుటుంబం. పల్లెలో ప్రాథమిక బడికూడా లేక పోవడంతో కాపుమొండివెంగనపల్లెలో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ వెదురుకుప్పంలో పదో తరగతి వరకు చదువుకున్నారు. కార్వేటినగరంలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో గణిత అధ్యాపకుడు కార్వేటినగరం నివాసి డాక్టర్ అరుణాలం ప్రోత్సాహం ఈయనకు దారి చూపింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ(హిందీ) చదివారు. పుణెలోని డెక్కన్ కాలేజీలో ఎంఏ భాషా శాస్త్రం చదివారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు అన్నామలై విశ్వవిద్యాలయంలోనూ, సీఐఐఎల్ (మైసూర్) లోనూ పనిచేశారు. అనంతరం కామన్వెల్త్ ఫెలోషిప్‌పై యూకే వెళ్లి ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో అండర్సన్ కేస్ గ్రామర్‌పై పీహెచ్‌డీ చేశారు. చంద్రగిరి మండలం రంగంపేటకు చెందిన కె.నాగమ్మతో వివాహం జరిగింది. ఆమె కూడా ప్రొఫెసర్‌గా చేశారు. 2008లో ఆమె చనిపోయారు. 1977లో ఉస్మానియా యూనివర్సిటీ భాషా శాస్త్ర విభాగంలో లెక్చరర్‌గా చేరి, తరువాత ప్రొఫెసర్ అయ్యారు. 1990లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి రిజిస్ట్రార్‌గానూ పనిచేశారు. కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం స్థాపించినపుడు తొలి రిజిస్ట్రార్‌గా సేవలను అందించారు. ఆ సమయంలో గురువు అరుణాచలం ఈ యూనివర్సిటీ వీసీగా ఉన్నారు.

ఆచార్య బండి రామకృష్ణారెడ్డి అనేక గిరిజన భాషలపై విశేష కృషి చేశారు. 'ఇంది-ఆవే'భాషకు లిపి తయారు చేశారు. భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. ఈయన మేనల్లుడు డాక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్యుడిగా ఉన్నారు. స్వస్థలంవీడి ఈ కుటుంబం దశాబ్దాల కిందటే వెళ్లిపోయినా వెదురుకుప్పం ప్రాంతంలో వీరికి బంధువర్గం ఉంది. వీరి మృతి పట్ల ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

ద్రావిడ వర్సిటీకి రామకృష్ణారెడ్డి సేవలు ఎనలేనివి

గుడుపల్లె, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయానికి తొలి రిజిస్ట్రార్‌గా పనిచేసిన పద్మశ్రీ రామకృష్ణారెడ్డి సేవలు ఎనలేనివని ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి తెలిపారు. గురువారం ద్రావిడ వర్సిటీలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట రామకృష్ణారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఇన్‌చార్జి వీసీతోపాటు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, డీన్ ఆచార్య శ్యామల, అధ్యాపకులు, ఉద్యోగులు పూలమాల వేసి, నివాళి అర్పించారు. పలువురు ఉద్యోగులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



రామకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దొరస్వామి తదితరులు



తిరుమలలో మీనాక్షి

హీరోయిన్ మీనాక్షి చౌదరి గురువారం సుప్రభాతసేవలో పాల్గొని తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆమెతో కలిసి సెల్ఫీలు తీసుకునేందుకు జనం ఎగబడ్డారు. ప్రస్తుతం నాగచైతన్య, నవీన్ పోలిశెట్టి సినిమాల్లో నటిస్తున్నట్టు మీనాక్షి చౌదరి తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఆలయంలోని శయనమందిరం

మన్నించు ముక్కంటీశా..!

- వసూళ్ల కేంద్రంగా శ్రీకాళహస్తీశ్వరాలయ శయనమందిరం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామి అమ్మవార్ల పవిత్రమైన శయన మందిరాన్ని కొందరు అక్రమార్కులు వసూళ్ల కేంద్రంగా మార్చుకున్నారు. ప్రతిరోజు ఆలయంలో స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు తెర వేసిన తర్వాత ఏకాంత సేవ నిర్వహిస్తుంటారు. ముందుగా మూలమూర్తులకు తెరవేసిన తరువాత స్వామి అమ్మవార్లను వెండిపల్లకీలో కొలువుదీర్చి ఆలయంలో ప్రాకారంగా ఊరేగిస్తారు. ఆ తరువాత స్వామి అమ్మవార్లు అమ్మవారి సన్నిధిలోని శయనమందిరం వద్దకు చేరుకుంటారు. శయనపాన్పు సుందరంగా సుగంధ పరిమళాలు వెదజల్లేపుష్పలతో అలంకరించి స్వామి అమ్మవార్లను కొలువుదీర్చుతారు. రాత్రి అక్కడ మళ్లీ నైవేద్య హారతులు సమర్పించి శయనమందిరంలో స్వామి అమ్మవార్లను ఏకాంతంగా నిద్రపుచ్చుతారు. ఆ తరువాత భక్తులందరిని వెలుపలకుపంపి ఆలయం మూసివేస్తారు. తిరిగి మరుసటిరోజు ఉదయం శయనమందిరం వద్ద సుప్రభాతం, గోపూజ నిర్వహించి స్వామి అమ్మవార్లను మేకొల్పుతారు. ఆపై స్వామి అమ్మవార్లు వారి గర్భాలయాలకు చేరుకున్న తరువాత మూలమూర్తుల దర్శనం ఆరంభమవుతుంది. రోజు స్వామి అమ్మవార్లు శయనించే పాన్పును పరమపవిత్రంగా భావించాలి. కానీ అమ్మవారి గర్భగుడి ఎదుటే ఉన్న శయనమందిరాన్ని పగలు మొత్తం యథేచ్ఛగా తెరచి ఉంచుతున్నారు. అంతే కాకుండా శయనమందిరంలోకి భక్తులు వచ్చి దక్షిణ సమర్పించాలంటూ బాహాటంగా చప్పట్లు కొట్టి మరీ పిలుస్తున్నారు. గురువారం ఓ సెక్యూరిటీగార్డు అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులను ముందుగా శయనమందిరంలోకి వెళ్లాలంటూ అరచి చెప్పడంపై కొందరు భక్తులు నిలదీశారు. పవిత్రమైన శయనపాన్పును భక్తులందరూ లోపలకు వెళ్లి స్పృశించడం శిరస్సుతో తాకి మొక్కడంపై కొందరు భక్తులు విస్మయం వ్యక్తం చేశారు. శయనపాన్పు పక్కనే కొందరు నిలబడి భక్తుల నుంచి నగదు వసూలు చేయడం గమనార్హం. ఈ శయన పాన్పు దందా రెండేళ్ల క్రితం విచ్చలవిడిగా జరిగేది. అప్పట్లో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలతో ఆ దందాకు స్వస్తిపడింది.మళ్లీ కొద్దిరోజులుగా పాత విధానానికి కొందరు అక్రమార్కులుతెరతీశారు. సంబంధిత అధికారులు స్పందించి కట్టడి చేయాల్సిందిగా భక్తులు కోరుతున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

- మే 2వ తేదీ రాత్రి 11.59 వరకు గడువు
- మే 18న పరీక్షలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు రిజిస్ట్రేషన్ ప్రారంభమైంది. ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభించి మే 2వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినవారు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌లు ఐఐటీ కాన్పూర్ ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఆ మేరకు అభ్యర్థులు కాన్పూర్ ఐఐటీ అధికారిక వెబ్‌సైట్ jeeadv.ac.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. మే 2వ తేదీ రాత్రి 11.59 గంటలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని ఎన్టీఏ పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళా అభ్యర్థులు రూ.1,600, ఇతర జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 3,200 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మే 18వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరుగనున్నాయి.

లక్షల్లో జీతాలు తీసుకొంటున్నారు

పేదలకు సరైన వైద్యం అందించలేరా?

- పీహెచ్‌సీ వైద్యులను ప్రశ్నించిన కలెక్టర్ వెంకటేశ్వర్



కాన్పుల గదిలోని వార్మర్ పరికరం వాడే విధానం తెలుసా అంటూ వైద్యులు చంద్రిక, చైతన్యను ప్రశ్నిస్తున్న కలెక్టర్

దొరవారిసత్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'రూ.లక్షల్లో జీతాలు తీసుకొంటున్నారు. పేదలకు సరైన వైద్యం అందించ లేరా? మీ పనితీరు సరిగా లేదు. పద్ధతి మార్చుకోండి' అంటూ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దొరవారిసత్రం పీహెచ్‌సీ వైద్యులను హెచ్చరించారు. గురువారం ఆయన ఆస్పత్రిని తనిఖీ చేశారు. ల్యాబొరేటరీలోని పరికరాలను పరిశీలించారు. వీటిని చూసుకొంటుంటారా.. ఉపయోగించరా అంటూ ప్రశ్నించారు. ఫార్మశిలోని మందులను చూశారు. కాన్పుల గదిలోకి వెళ్లిన ఆయన ఇంత మంచి వసతి పెట్టుకొని కాన్పులు ఎందుకు చేయడం లేదని వైద్యురాలు చంద్రికను ప్రశ్నించారు. పుట్టిన బిడ్డను ఉంచే వార్మర్ పరికరాన్ని చూసిన కలెక్టర్.. దీనిని వాడే విధానం మీకు తెలుసా అంటూ డాక్టర్లు చంద్రిక, చైతన్యను అడిగారు. వారి నుంచి సమాధానం రాకపోవడంతో బేబి పుట్టిన వెంటనే ఉంచే వార్మర్ గురించీ తెలియక పోతే మీరేం వైద్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంచి కళాశాలల్లో చదివి ప్రభుత్వం ఉద్యోగం వచ్చిన తర్వాత వృత్తిని మరిచిపోయారా అంటూ మండిపడ్డారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి రోగికి మంచి వైద్యం అందేలా మీలో మార్పులు రావాలని కోరారు. ఈ ఆస్పత్రిని తరచూ తనిఖీ చేయాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి సూచించారు. జిల్లా వైద్యాధికారులతోనూ మాట్లాడి సరిచేయాలన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మంగళం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వితంతు పింఛన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో సామాజిక భద్రత పింఛన్లు పొందుతూ ఏదేని కారణంతో మరణిస్తే అతని భార్యకు ఇచ్చే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. భర్త, భార్య ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పింఛను పుస్తకం, భర్త మరణ ధృవీకరణ పత్రం జిరాక్సు కాపీలను జతచేసి, శనివారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జూన్ నుంచి పింఛన్లు మంజూరయ్యే అవకాశముందని వెల్లడించారు.

జగన్ విధానాలపై విచారణ జరగాల్సిందే

- పహల్గాం దాడిపై దర్యాప్తు చేపట్టాలి
- సీపీఎం నేత మధు



తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సీఎంగా జగన్ విద్యుత్ రంగంలో చేసిన విధానాలపై (విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలపై) విచారణ జరగాల్సిందేనని సీపీఎం నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు మధు డిమాండు చేశారు. ప్రస్తుతం విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో సమూల మార్పులు జరగాలంటే వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం తప్ప వేరే మార్గం లేదని పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయ విధానాల కోసం మే 20న నిర్వహించే సమ్మెకు ప్రజలు మద్దతివ్వాలని కోరారు. సత్యవేడు ఎస్‌ఈజెడ్‌లో రైతుల అంగీకారంతోనే భూములు తీసుకోవాలన్నారు. తిరుపతికి సమీపంలోని శెట్టిపల్లి భూముల సమస్యను వెంటనే పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. హామీల అమలులో ప్రభుత్వం వెనుకబడిందని ఆరోపించారు. పహల్గాం దాడిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. ఈ దాడిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని రూపుమాపుతామని చెప్పిందని, పరిస్థితిని బట్టి చూస్తే ఉగ్రవాదం అలానే ఉందనిపిస్తోందన్నారు. ఉగ్రవాద చర్యలను ప్రజలంతా ఖండిస్తున్నారని, కొన్ని రాజకీయ పార్టీలు ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాయని వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు కందారపు మురళి, వందవాసి నాగరాజు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారాలు





పవన్ కల్యాణ్ నుంచి పురస్కారం అందుకుంటున్న సుశీలాదేవి, రామ్మోహన్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన అధికారులు, ఉద్యోగులకు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉత్తమ పురస్కారాలు అందజేశారు. గురువారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో పన్ను వసూళ్లలో ప్రతిభ కనబరచిన జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి సుశీలాదేవి.. పల్లె పండుగ అమలులో ప్రతిభ కనబరచిన డీపీఆర్ ఈవో (పంచాయతీరాజ్ ఎస్‌ఈ) రామ్మోహన్.. ఉపాధి హామీ పథకంలో ఉత్తమ సేవలు అందించిన ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజు పురస్కారాలు అందుకున్నారు. వీరిని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు.

పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 30న నిర్వహించనున్న పాలీసెట్ హాల్ టికెట్లు విడుదల చేసినట్టు సాంకేతిక విద్యా శాఖ, శిక్షణ బోర్డు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులు ఏపీ పాలీసెట్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలని, పోస్టులేదా ఇతర ఆఫ్‌లైన్ మార్గాల్లో పంపబోమని స్పష్టం చేసింది.విద్యార్థులు ముందుగానే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాని సూచించింది.

పహల్గాం 'ఉగ్ర'దాడితో

తిరుపతి, తిరుమలలో హై అలర్ట్

- ఘాట్లలో ముమ్మరంగా కూంబింగ్



తిరుపతిలో వాహనాలు తనిఖీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పోలీసులు, టీటీడీ విజిలెన్సు అప్రమత్తమైంది. తిరుపతి, తిరుమలలో భద్రత కట్టుదిట్టం చేశారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, విష్ణునివాసం, మాధవం, అన్ని ఆలయాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుమానం ఉన్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు కట్టుదిట్టం చేశారు. తిరుపతిలోని అన్ని రోడ్లు, ముఖ్య కూడళ్లలో బాంబు, డాగ్ స్క్వాడ్లు తనిఖీలు చేస్తున్నాయి. ఇప్పటికే బాంబు నిర్వీర్యం చేసే దళాలు రంగంలోకి దిగి లాడ్జీలు, కొన్ని భవనాలు పరిశీలిస్తున్నారు. ఆలయాల వద్ద భద్రత పెంచారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇలాంటి తనిఖీలు మరో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు చెప్పారు. తిరుపతి, తిరుమలలో మొత్తం 75 ప్రాంతాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇక, అలిపిరి చెక్ పాయింట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. రెండు ఘాట్ రోడ్లలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఘాట్‌లోని లింకు రోడ్డులో ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేసి పంపుతున్నారు. టీటీడీ సీవీఎస్‌వో ఎఫ్ఏసీ హోదాలో ఎస్పీ హర్షవర్ధనరాజు తిరుమల భద్రతపై అన్ని శాఖల అధికారులతో సమీక్షించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.





తిరుమలలో సీసీ కెమెరా పనితీరు పరిశీలన - ఘాట్ లింక్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు


'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా విజేతలకు
బహుమతుల పంపిణీ

తిరుపతి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' పాఠకులకు కార్ అండ్ బైక్ రేసుకు సంబంధించి గత నెల 25వ తేదీన జరిగిన లక్కీ డ్రాలో విజేతలైన ముగ్గురికి గురువారం తిరుపతిలో బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి పొందిన తిరుపతి గోపాలరాజు కాలనీకి చెందిన డి.వత్సలకు ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచి మేనేజరు సురేష్‌రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి హీరో హోండా బైక్‌కు సంబంధించి చెక్ అందజేశారు. తిరుపతి కపిలతీర్థం రోడ్డుకు చెందిన మరుదాడ నగేష్‌కు ద్వితీయ బహుమతి కింద రెఫ్రిజిరేటర్.. పలమనేరు నెహ్రూ నగర్‌కు చెందిన టి.కె.శశిధర్‌కు తృతీయ బహుమతి కింద టీవీ అందజేశారు.



ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద చెక్కు, రిఫ్రిజిరేటర్, టవీ అందుకుంటున్న వత్సల, నగేష్, టి.కె.శశిధర్

సర్వదర్శనానికి 12 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంటన్నీ సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.62 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 68,705

తలనీలాలు సమర్పించినవారు: 25,382



ఇలా సిద్ధమైతే... పాలిసెట్ విజేతలు మీరే



గణితం

త్రికోణమితి, నిరూపక రేఖా గణితం, సంభావ్యత, సంఖ్యాశాస్త్రం, పురోగతి, త్రిభుజాలు, వృత్తాలు, ద్విపద సిద్ధాంతం, మాత్రికలు, ఘతాంతక మరియు లాగరిథమిక్ సిరీస్, సమీకరణాల సిద్ధాంతం వంటి వాటిపై విద్యార్థులు పట్టు సాధించాలి. ఐదేళ్ల క్రితం నుంచి ఉన్న ప్రశ్నా పత్రాలను అభ్యాసం చేయగలిగితే మంచి మార్కులు పొందొచ్చు. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల్లో ప్రతి ఛాప్టర్ చివరిలోని ముఖ్యాంశాలను చదువుకోవాలి.

ఫిజిక్స్

ఆరు చాప్టర్లు ఉంటాయి. వేడి, సమతల ఉపరితలాలల వద్ద కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, వివిధ ఉపరితలాల ద్వారా కాంతి ప్రతిబింబం, మానవ కన్ను, రంగుల ప్రపంచం, విద్యుదయస్కాంతత్వం చాప్టర్లలో ఒక్కో ఛాప్టర్ నుంచి 8 నుంచి 10 ప్రశ్నల వరకు వచ్చే అవకాశం ఉంది.



తిరుపతి(విద్య), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులపై ఆసక్తి పెరుగుతోంది. పదవ తరగతి తర్వాత ఎక్కువ మంది ఈ కోర్సుల్లో చేరేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎక్కువ మందికి ఉద్యోగ,ఉపాధి ఉపాధి అవకాశాలు లభించడమే ఇందుకు కారణం. జిల్లాలో 6 ప్రభుత్వ, 7 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ఎయిడెడ్ కళాశాల కూడా ఉంది. మొత్తం 3500 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుల ప్రవేశానికి ఈనెల 30న జరిగే పాలిసెట్ పరీక్షకు సిలబస్‌ను బాగా చదువుకుంటే విజేతగా నిలవడం సులభమేనంటున్నారు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్.వి. గౌరీశంకర్. రెండు గంటల్లో 120 ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయగలిగేలా టైం ప్లాన్ చేసుకోవాలంటున్నారు. పదవ తరగతి సిలబస్ నుంచి గణితంలో 50 మార్కులకు, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నాపత్రం ఉంటుంది. నెగెటివ్ మార్కులు ఉండవు. సబ్జెక్టుల వారీగా ఆయన సూచనలిలా..

డాక్టర్ **ఎస్.వి. గౌరీశంకర్,** జనరల్ సెక్షన్ హెడ్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తిరుపతి.

కెమిస్ట్రీ


పదవ తరగతి కెమిస్ట్రీలో నాలుగు చాప్టర్లు ఉంటాయి. ఒక్కో చాప్టర్ నుంచి 7 నుంచి 8 ప్రశ్నలు వచ్చే అవకాశముంటుంది. మూలకాల వర్గీకరణ-ఆవర్తన పట్టిక, లోహశాస్త్రం సూత్రాలు, రసాయన ప్రతిచర్యలు, సమీకరణాలు, అణువుల నిర్మాణం, రసాయన బంధం, కార్బన్-సమ్మేళనాలు, ఆమ్లాలు, క్షారాలు,లవణాలు అంశాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ముందుగా కెమిస్ట్రీ ప్రశ్నలకు జవాబులు ఇస్తే సమయం కలిసి వస్తుంది.

మంచి భవిష్యత్తు



పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. కోర్సు పూర్తిచేసివారు ఎంట్రన్స్ ర్యాంకుతో నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కళాశాలల్లోని సహాయక కేంద్రాలలో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

- డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



కళాశాలల వివరాలు

- **తిరుపతి:** బయోమెడికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ (షుగర్ టెక్నాలజీ), కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఫార్మసీ (ఇంటర్ అర్హతతో).
- **చంద్రగిరి:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్.
- **కీల్లాపట్టు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ ఇంజనీరింగ్.
- **సత్యవేడు:** మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్.
- **గూడురు:** మైనింగ్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్ టెక్నాలజీ. (ప్రత్యేక కళాశాల).
- **తిరుపతి టీటీడీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల:** కంప్యూటర్ అండ్ కమర్షియల్ ప్రాక్టీసతో పాటు కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మసీ (ఇంటర్ అర్హత) బ్రాంచిలున్నాయి.

టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



టీటీడీకి గురువారం ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందింది. మహారాష్ట్రకు చెందిన బిగాస్ ఆటోప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం రూ.1.40 లక్షల విలువైన బిగాస్ సీ12 మాక్స్ 3.0 అనే ఎలక్ట్రిక్ స్కూటర్‌ను టీటీడీకి అందజేసింది. ముందుగా వాహనానికి శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ డిప్యూటీఈవో లోకనాథంకు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దుర్గేష్ గుప్తా వాహన తాళాన్ని అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డిప్యూటీ సీఎంకు సాదర వీడ్కోలు



రేణిగుంట, ఏప్రిల్ 24, (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తిరుపతి విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. పెహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదన్‌రావుకు గురువారం నివాళులర్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన సాయంత్రం 6.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకోగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఏఎస్పీ రవిమనోహరచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహశీల్దార్ సురేష్‌బాబు, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుత వీడ్కోలు పలికారు. ఆయన ప్రత్యేక విమానంలో విశాఖపట్నం వెళ్లారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ శ్రీకాళహస్తి న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు కోర్టు లైజనింగ్ అధికారి గోపాల్‌రాజు గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఏర్పేడు మండలం చెల్లూరుకు చెందిన సుబ్బమ్మ, కుమారుడు జగ్గయ్యతో కలిసి నివాసం ఉండేది. ఆమె భర్త బాలసుబ్రహ్మణ్యం కుటుంబ కలహాలతో మునిలిపేడులో ఉంటున్నాడు. అనారోగ్యంతో ఆయన 2016లో మృతి చెందాడు. భర్త కర్మక్రియల కోసం కుమారుడితో కలిసి సుబ్బమ్మ అప్పట్లో మునిలిపేడుకు వెళ్లగా, ఇంటి స్థలం విషయమై వారిమధ్య విబేధాలు ఉండటంతో భర్త తరపు బంధువులు ఆమెను అడ్డుకుని వెళ్లగొట్టారు. ఆ తర్వాత 2017 ఏప్రిల్‌లో పోలీస్‌స్టేషన్ ఎదుట ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని నిరసన చేస్తున్న వారిపై లారీ దూసుకెళ్లిన ఘటనలో మృతిచెందిన వారిలో మునిలిపేడుకు చెందిన సుబ్బమ్మ దాయాదులైన బాబు, హరి ఉన్నారు. 2017 మే 11న మునిలిపేడులో దాయాదుల కర్మక్రియలకు సుబ్బమ్మ, జగ్గయ్య వెళ్లగా.. మళ్లీ భర్త తరపు బంధువులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. కొందరు పెద్దలు ఇరువర్గాలకు చెప్పారు. ఈ క్రమంలో బాలసుబ్రహ్మణ్యం సోదరి సుజాత బొడ్డులో కత్తి పెట్టుకుని వచ్చి వదిన సుబ్బమ్మను పొడవడంతో ఆమె కుప్పకూలారు. సుజాతకు భర్త వెంకటేష్, అత్త రాణెమ్మ సహకరించారు. ఆ తర్వాత జగ్గయ్యను కూడా పొడిచేందుకు ప్రయత్నించగా మిగతావారు అడ్డుకున్నారు. గాయపడిన సుబ్బమ్మను తిరుపతి రుయాకు తరలించగా అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. జగ్గయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వెంకటరమణ హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏ1 సుజాత, ఏ2 రాణెమ్మ, ఏ3 వెంకటేష్‌ను అప్పట్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి న్యాయస్థానంలో విచారణఅనంతరం గురువారం 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ ముగ్గురు నిందితులకు యావజ్జీవశిక్షతో పాటు రూ.15వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు చేధనలో పీపీ వీరరాఘవరెడ్డి, కోర్టు మానటరింగ్ సీఐ వెంకటప్ప తదితరులు చొరవ చూపారు. చురుగ్గా వ్యవహరించిన ఏర్పేడు పోలీసు అధికారులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

రెవెన్యూ అధికారులు లంచం అడుగుతున్నారా?

- బోడిలింగాలపాడు గ్రామస్థులను అడిగిన కలెక్టర్


గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు, సిబ్బంది మిమ్మల్ని లంచాలు అడుగుతున్నారా? లేకపోతే ఇబ్బందులు పెడుతున్నారా?' అని కలెక్టర్ వెంకటేశ్వర్ స్థానికులను ప్రశ్నించారు. తడ మండలం తడకండ్రిగ పంచాయతీ బోడిలింగాలపాడులో గురువారం పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సుల అర్జీల పరిష్కారంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది వల్ల ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. బోడిలింగాలపాడు జాతీయ రహదారి మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని దానిపై చర్యలు తీసుకోవాలని, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. నెల్లూరుజిల్లా జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఫోన్‌చేసి ఆ మలుపును పరిశీలించి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

రూ.25 కోట్లతో హాస్టళ్ల మరమ్మతులు

జిల్లాలో రూ.25 కోట్లతో సుమారు 110 హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తడలోని బీసీ బాలుర వసతి గృహంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. హాస్టళ్లలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.6 కోట్లను మంజూరు చేసిందని, అదనంగా కావాల్సిన సౌకర్యాల కోసం జిల్లాస్థాయిలోనే పరిశ్రమల సీఎస్ఆర్ నిధులు, బీఎంఎస్, ఎంపీలాడ్స్ నుంచి రూ.25 కోట్లు సమకూర్చుకుని అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నామన్నారు. వీటిద్వారా ఆర్‌వో వాటర్, రూఫ్ ట్రీట్‌మెంట్, మరుగుదొడ్లు, పర్మినెంట్ వంట గది, దోమల తెరలతో కూడిన కిటికీలు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పనులన్నీ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీవో కిరణ్మయి, తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు శరత్‌బాబు, నరసింహారావు, ఎంపీడీవో విజయ్ కుమార్, సూళ్లూరుపేట ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తనల వైపు యువతను తీసుకెళ్లాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను యువతకు యూట్యూబ్ ద్వారా చేరువ చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పరిపాలనా భవనంలో గురువారం వివిధ విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఎస్వీబీసీ ద్వారా సంకీర్తనలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఇందుకోసం నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి వారి సలహాలు, సూచనలతో వేగవంతంగా సంకీర్తనలను యూట్యూబ్‌లో ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుపతిలో జరుగుతున్న వివిధ ఇంజినీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. వేసవి సందర్భంగా స్థానికాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా, రద్దీకనుగుణంగా చర్యలు చేపట్టాలని జేఈవోను ఆదేశించారు. అనంతరం తిరుపతిలోని ఆరోగ్య విభాగం, శ్వేత, టీటీడీ కొనుగోళ్ల విభాగం, స్విమ్స్ విద్య, వైద్యం తదితర విభాగాల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 22 మంది డిబార్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో చేపట్టిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షల్లో 22 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. మదనపల్లె-16, చిత్తూరు-6 మంది మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విషయాన్ని గుర్తించి హైపవర్ కమిటీ డిబార్ చేసినట్లు పరీక్షల అధికారి దామ్లా నాయక్ తెలిపారు.

ఉగ్రవాదులే వస్తే..

తిరుమలలో ఆక్టోపస్ మాక్ డ్రిల్


విశ్రాంతి భవనంలోకి వెళుతున్న ఉగ్రవాదులు


ఉగ్రవాదుల సమాచారమిస్తున్న విజిలెన్స్ వీజీవో

ఆది తిరుమల లేపాక్షి సర్కిల్ వద్దనున్న సుదర్శన్ విశ్రాంతి భవనం. గురువారం సాయంత్రం ముగ్గురు ఉగ్రవాదులు వాహనంలో వచ్చి పాకిస్థాన్ జిందాబాద్, జీహాద్ అంటూ కేకలు వేస్తూ వచ్చారు. విశ్రాంతి గృహ ప్రవేశం వద్ద ఇద్దరు సెక్యూరిటీ గార్డులను గాయపరిచారు. ఒక ఉగ్రవాది అంతస్థు పైభాగంలోకి.. మరొకరు ఓ గదిలోకి.. ఇంకొకరు భవనం ప్రవేశంలోకి చేరారు. విజిలెన్స్ సిబ్బంది సమాచారంతో వీజీవో, స్థానిక పోలీసు అధికారులతో పాటు ఓ కమెండో ఆధ్వర్యంలో 29 మంది ఆక్టోపస్ సిబ్బంది లేపాక్షి సర్కిల్‌కు చేరుకున్నారు. భవనం మ్యాప్‌ను పరిశీలించారు. మూడు బృందాలుగా విడిపోయారు. భవనం ప్రవేశంలో ఉన్న ఓ ఉగ్రవాదిని అసాల్ట్ డాగ్ ఎనిమీ విధానంలో హతమార్చారు. ఆ తర్వాత భవనంలోకి వెళ్లి, ఓ గదిలో దాక్కున్న ఉగ్రవాదిని, ఆ తర్వాత భవనంపై ఉన్న మరో ఉగ్రవాదిని హతమార్చారు. అప్పటికే విశ్రాంతి భవనం వద్దకు చేరుకున్న వైద్య సిబ్బంది ఉగ్రవాదుల దాడిలో గాయపడిన భక్తుడు, సిబ్బందికి చికిత్స అందజేసి అస్పత్రికి తరలించారు. ఇక, ఫైర్ సిబ్బంది కూడా ఉగ్రవాదులు ద్వారా తలెత్తిన మంటలను అదుపుచేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




విశ్రాంతి భవనంలోకి ప్రవేశిస్తున్న అక్టోపస్ సిబ్బంది - రూమ్ ఇన్టర్వెన్షన్ విధానంలో మరో ఉగ్రవాదిని అదుపులోకి తీసుకున్న అక్టోపస్ సిబ్బంది

- పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలో ఆక్టోసప్ బృందం ఇలా దాదాపు ఒకటిన్నర గంట పాటు జరిపిన మాక్‌డ్రిల్ ఇది. భక్తులు బస చేసే అతిథిగృహంలోకి ఉగ్రవాదులే వస్తే ఎలా స్పందించాలనే దానిపై మాక్ డ్రిల్ జరిగింది. దాదాపు 30 మంది అక్టోపస్ సిబ్బంది, 25 మంది విజిలెన్స్, 15 మంది పోలీసులు, 10 మంది ఏపీ ఎస్పీ సిబ్బంది డ్రిల్‌లో పాల్గొన్నారు.






విశ్రాంతి భవనం ముందున్న ఉగ్రవాదిని అసాల్ట్ డాగ్ ఎనిమీ విధానంలో హతమారుస్తున్న సిబ్బంది - విశ్రాంతి భవనం పైభాగంలో మరో బృందం - ఉగ్రవాదిని హతమార్చుతున్న సిబ్బంది


గాయపడిన భక్తుడిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో త్రిశూలం ప్రతిష్ఠ



త్రిశూలాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, ప్రభావతమ్మ తదితరులు

నాయుడుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలోని ప్రసూన్నాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ త్రిశూలాన్ని ప్రతిష్ఠించారు. ఆలయానికి రాజగోపాల్‌రెడ్డి, విద్యావతి దంపతులు త్రిశూలాన్ని బహూకరించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ గూడూరు సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచి ప్రభావతమ్మ, ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ స్వామి, కమిటీ సభ్యులు అంకయ్య, రాజయ్య, బ్రహ్మయ్య, అధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



సమావేశంలో ప్రజాప్రతినిధులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గురవయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరిచేందుకు, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రాణి, శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీవో మధుసూదన్‌రావు, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మయూరి శ్యామ్‌యాదవ్

గూడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే విద్యార్థులు చదువులపై శ్రద్ధచూపి రాణించాలని రోటరీక్లబ్ సభ్యుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. గురువారం స్థానిక సరస్వతి శిశు మందిరం పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదవి వాటిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, శ్రీధర్‌రెడ్డి, సోమనాథ్, మురళీనాయుడు, అశోక్‌కుమార్, రమణయ్య, రామమోహన్‌రావు, లలిత, రంగనాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

ఓజిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఆయా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె కార్యదర్శులతో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి పథకాలను పర్యవేక్షిస్తూ మరమ్మతులకు గురైన వాటిని వెంటనే బాగు చేయాలన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నాయుడుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఉన్న వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించడం అన్యాయమని, తక్షణమే సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింలు డిమాండు చేశారు. గురువారం వారు పట్టణంలోని జామియా మసీదు నుంచి అంబేడ్కర్ విగ్రహం ర్యాలీ నిర్వహించారు. అక్కడే మానవహారం చేపట్టారు. అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశారు. కాశ్మీరులోని పహల్గామ్‌లో యాత్రికులపై ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లీ రహంతుల్లా సాహెబ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ షరీఫ్, మౌలానా అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే ఎలా!



డక్కిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నిబంధనలు పాటించని వారికి జరిమానా సైతం విధిస్తున్నారు. అయినా ప్రజల్లో మార్పురావడంలేదు. గురువారం ఓ ద్విచక్ర వాహనంపై ఆరుగురు ప్రయాణిస్తూ డక్కిలి ఎస్‌ఐ శివశంకర్ కంట పడ్డారు. మండలంలోని కందలవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి తన భార్య, నలుగురు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణించడం గమనించిన ఎస్‌ఐ వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. కనీసం హెల్మెట్ కూడా ధరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే కేసు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ వద్ద గురువారం ప్రమాదం జరిగింది. పట్టణంలోని సాయి నగర్‌కు చెందిన రసూల్ మోటారు సైకిల్‌పై వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న మహిళ వేలూరు జ్ఞానమ్మను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

డక్కిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో యాత్రికులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని వెంకటగిరి జనసేన క ఓ్వనర్ జంపాల ప్రకాష్ అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం ప్రకటించారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలన్నారు.

నిద్రపోతున్న నిఘా నేత్రాలు... చెలరేగుతున్న చోరులు

వరుస చైన్ స్నాచింగ్‌లతో హడలిపోతున్న మహిళలు ● ఇంటి ముందు ముగ్గు వేయాలన్నా భయమే



మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరా

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) నాయుడుపేట పట్టణంలో నిఘా నేత్రాలు పని చేయడంలేదు. ఇదే అదునుగా చైన్ స్నాచర్లు చెలరేగిపోతున్నారు. ఇళ్ల ముందు ముగ్గులు వేయాలంటే మహిళలు హడలి పోతున్నారు. కొంతకాలంగా పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేకపోవడంతో పాటు పోలీసింగ్ లేకపోవడంతో చైన్ స్నాచింగ్‌లు పెరిగిపోయాయి. పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీసు స్టేషన్‌లో కంట్రోల్ రూంకు అనుసంధానించి పర్యవేక్షించేవారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య క్షణాల్లో పరిష్కారమయ్యేది. అలాగే చోరీలు జరిగిన గంటల వ్యవధిలోనే దొంగలను పోలీసులు పట్టుకునేవారు. అయితే కొంతకాలంగా పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. మరమ్మతులకు గురైన కెమెరాలను బాగు చేయకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఇదే అదునుగా చైన్ స్నాచర్లు తమ తమ చేతివాటం చూపుతూ మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను లాక్కుని పరారవుతున్నారు. గత నెలలో ఓ వృద్ధురాలు ఇంటి ముందు కూర్చుని ఉండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని బంగారు చైను లాక్కుని పరారయ్యారు. అలాగే పండ్లూరులో ఓ మహిళ నుంచి బంగారు చైను లాక్కెళ్లారు. ఈనెల 15వ తేదీన పట్టణంలోని లోతువానిగుంట సమీపంలోని దుకాణానికి నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు చైను లాక్కుని పరారయ్యారు. దీంతో మహిళలు బయట తిరగాలంటే హడలిపోతున్నారు. ఇళ్ల ముందు ముగ్గు వేయాలన్నా భయపడుతున్నారు. పోలీసులు స్పందించి సీసీ కెమెరాలను బాగు చేయడంతో పాటు చైన్ స్నాచింగ్‌లను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు: కలెక్టర్



ఏకొల్లు ఎస్సీ బాలికల వసతి గృహంలో మంచి నీటి తొట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

దొరవారిసత్రం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన దొరవారిసత్రం మండలంలోని ఏకొల్లు ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, కొళాయిలు, భవనం పెయిటింగ్, కిటికీలు మరమ్మతులు, ఆర్వో వాటర్ ప్లాంటు ఏర్పాటు పనులను పరిశీలించారు. పనుల్లో ఇంజనీరింగ్ అధికారి చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు కన్పించడంతో సదరు అధికారిని హెచ్చరించారు. ప్రతి పనిలో నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై విద్యార్థులు పాఠశాలలకు వచ్చేసరికి వసతి గృహం అందంగా కనబడాలన్నారు. అలాగే వసతి గృహంలో శుభ్రత పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడి యాతో మాట్లాడుతూ జిల్లాలో అన్ని వసతి గృహాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏకొల్లు ఎస్సీ బాలికల వసతి గృహంలో రూ.18.36 లక్షలతో వివిధ పనులు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే ప్రతి విద్యార్థీ మంచి సౌకర్యాల నడుమ చదువుకోవాలన్నది తన లక్ష్యమన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో అపాచీ కార్మికుడి దుర్మరణం



సురేంద్రబాబు(ఫైల్‌ఫోటో)

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట హోలిక్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాంలో అపాచీ పరిశ్రమ కార్మికుడు మాయారి సురేంద్రబాబు(35) దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... దొరవారి సత్రం మండలం మోదుగులపాలెం గ్రామానికి చెందిన సురేంద్రబాబు తడ మండలం మాంబట్టు పారిశ్రామిక వాడలోని అపాచీ పరిశ్రమలో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి వద్ద నుంచి మోటరు సైకిల్ కంపెనీకి వెళ్లేందుకు బయలుదేరాడు. సూళ్లూరుపేట హోలిక్రాస్ సర్కిల్ వద్ద వెళ్తుండగా కార్మికులను తీసుకెళ్తున్న అపాచీ పరిశ్రమ అకస్మాత్తుగా ఆగడంతో సురేంద్రబాబు బైక్ ఆపారు. ఇంతలో వెనుక వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు, లారీ మధ్య ఇరుక్కుపోయిన సురేంద్రబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



కొత్తచెరువు గ్రామంలో రీ సర్వే సందర్భంగా రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కొత్తచెరువు గ్రామంలో జరుగుతున్న భూముల రిసర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ వివాదాలు రీ సర్వేతో సమసి పోతాయన్నారు. రీ సర్వే పక్కాగా నిర్వహించాలని సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి ఖచ్చితమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రీ సర్వే ద్వారా మ్యుటేషన్లు, వెబ్‌ల్యాడ్ కరక్షన్స్, సరిహద్దు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

ఇకూరుపాడులో రీసర్వే ప్రారంభం

కోట: మండల పరిధిలోని సిద్దవరం పంచాయతీ ఇకూరుపాడులో భూముల రీసర్వే ప్రారంభమైంది. గ్రామంలో ఉన్న 339 ఎకరాల భూముల రీసర్వే చేసేందుకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో పలుపంచాయతీల వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, డీఎల్‌పీవో రవీంద్రబాబు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏపీవో లక్ష్మీనారాయణ, పీఆర్ ఏఈ నందకిషోర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


పహల్గాం యాత్రికులపై దాడి దారుణం



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

కోట, ఏప్రిల్ 24: కశ్మీర్‌లోని పహల్గాం వద్ద యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ గురువారం విద్యానగర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గాంధీబొమ్మ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పర్యాటక ప్రాంతంలో ప్రకృతి అందాలను తిలకిస్తూ సంతోషంగా గడుపుతున్న పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి 26మందిని చంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, సైన్స్ అండ్ హ్యూమనిటి విభాగాధిపతి డాక్టర్ రవీంద్రరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు మాధవయ్య, మల్లిఖార్జునరెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్‌లు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను ఏబీవీపీ నాయకులు దహనం చేశారు. కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చందు, వినయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపట్నంలో సబ్ కలెక్టర్ పర్యటన



శ్రీనివాసస్రతంలో భూముల వివరాలను అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

కోట, ఏప్రిల్ 24: మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గురువారం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పర్యటించారు. పంచాయతీ పరిధిలోని శ్రీనివాసస్రతం, గున్నంపడియ, యమదినెన్నపాళెం గ్రామాల్లో చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌లో భూములు కోల్పోయే రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో భూసర్వేను పరిశీలించారు. ప్రభుత్వ భూములు, ఆక్రమణదారుల వివరాలతో నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ జయజయరావును ఆదేశించారు. ఆయన వెంట మండల సర్వేయర్ గోపిరెడ్డి, వీఆర్వో వెంకటేశ్వర్లు ఉన్నారు.

పూలతోట మాజీ సర్పంచ్ మృతి



బాలయ్య(ఫైల్‌ఫోటో)

దొరవారిసత్రం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం పూలతోట మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నేత కొణతం బాలయ్య(75) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం ఇంటి వద్దనే తుదిశ్వాస విడిచారు. బాలయ్య మాజీ మంత్రి పరసారత్నం సమీప బంధువు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నారు.

సీపీఐ నేతకు పరామర్శ

గూడూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా ఇటీవల అనారోగ్య కారణంగా చెన్నైలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, ఇతర నాయకులు కాలేషాను ఆయన నివాసంలో పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, రమేష్, జమాలుల్లా తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు బైక్ నడిపితే సీజ్ చేస్తాం

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మైనర్లు బైక్ నడిపితే వాహనం సీజ్ చేస్తామని సీఐ రమణ, ఎస్‌ఐ సుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక క్రాస్ రోడ్డు, పాలకేంద్రం సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుటే
ప్రభుత్వ భూమి ఆక్రమించారు
కలెక్టర్‌కు ఏకొల్లు గ్రామస్తుల ఫిర్యాదు

దొరవారిసత్రం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం ఎదుటే జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఏకొల్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహం పరిశీలనకు విచ్చేసిన కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందించారు. ఇళ్ల స్థలాలకు ఇచ్చిన భూమిని ఆక్రమించి కట్టడాలు చేస్తున్నారని తెలిపారు. అడవిలో నుంచి చెరువులోకి వచ్చే వరవ కాలువను కూడా పూడ్చేశారని మాజీ సర్పంచు కృష్ణమూర్తి, రామయ్య కలెక్టర్‌కు వివరించారు. ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తి కొందరి దగ్గర ఇళ్ల స్థలాలను కొన్నారని తహసీల్దారు శైలాకుమారి చెప్పడంతో, మిగిలిన భూమిని గతంలో పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు చెందేలా చూడాలని, అలాగే కాలువ ఆక్రమణను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

షార్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, ముఖ్య అతిథి సుధాకర్ నాయక్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. శ్రీహరికోటలోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను ముంబాయికి చెందిన ఐఆర్ఎస్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సుధాకర్ నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్ఏ డీడీ గోపికృష్ణ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీవో పదోన్నతుల్ల ఈవోపీఆర్‌డీలకు 60శాతం, ఏవోలకు 30శాతం ఇవ్వడం అన్యాయమన్నారు. ఇతర సిబ్బందికి కూడా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది గజేంద్రబాబు, రమణయ్య, చంద్రమౌళి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లొద్దు



చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

డక్కిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు సరదాగా బావులు, చెరువులు, గుంటల్లో ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోవద్దని ఎస్‌ఐ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన చెరువులు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. వేసవి సెలవుల్లో పిల్లలు సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన ఘటనల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు.

కోట: వేసవిలో సెలవుల్లో చెరువుల్లో ఈతకు వెళ్లరాదంటూ మండలంలోని పెన్నక్కచెరువు, కొండుగుంట, చిట్టేడు, తిమ్మానాయుడుపాళెం, చంద్రశేఖరపురం చెరువుల్లో ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

వేసవి శిక్షణ శిబిరం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యశోదనగర్‌లో ఉన్న వేమన విజ్ఞాన కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 28నుంచి మే 7 వరకు డ్రాయింగ్, మ్యాథ్స్, 8నుంచి 21 వరకు కథలు, పాటలు, చేతి రాత, 22 నుంచి 31 చెస్, స్పోకన్ ఇంగ్లిష్, మే 1 నుంచి 31 వరకు కర్రసాము, మే 1నుంచి 6 నెలల పాటు క్లాసికల్ డ్యాన్స్‌పై శిక్షణ ఉంటుంది. వివరాలకు 8985080370, 9398000686 నంబర్లను సంప్రదించాలి.